
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
ఖమ్మం
KHAMMAM
సోమవారం, 26 ఆగస్టు 2024
5



లోపలి పేజీల్లో...
చాయ్ లేదు... బిస్కెట్ లేదు... -6లో...
అగ్గి రాజేస్తున్న పోడు వివాదాలు -6లో...
ఆ ఉపాధ్యాయుడి లెక్కే వేరు.. -6లో...
కానిస్టేబుల్ దంపతులకు గోల్డ్ మెడల్ -6లో...
కొనసాగుతున్న శ్రీమద్భాగవత సప్తాహం-6లో...
డేంజర్.. యమ డేంజర్.. -6లో...



- బొగ్గు గనుల కార్మికుల సొమ్ము కొల్లగొట్టిన బడాబాబులు
- సీఎంపీఎఫ్ నిధులు రూ.977 కోట్ల గల్లంతు
- పెట్టుబడులు పెట్టిన సంస్థల దివాలా
- బాధ్యులపై చర్యలకు కేంద్రం వెనుకడుగు
- సీబీఐ విచారణ జరపాలంటున్న బీఎంఎస్ నేతలు
- భవిష్యత్తులో పింఛన్లపై కార్మికుల్లో ఆందోళన

పింఛన్ సొమ్ముతో వంచన

బొగ్గు గని కార్మికుల రెక్కల కష్టాన్ని బడాబాబులు కొల్లగొడుతున్నారు. కోల్ మైన్స్ ప్రావిడెంట్ ఫండ్ (సీఎంపీఎఫ్)ను నిలువునా దోచుకుపోతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. కార్మికుల భవిష్యనిధిని కాపాడాల్సిన అధికారులు.. నిధులను కాజేసే కుట్రల్లో భాగస్వాములయ్యారని ఆరోపణలు వెలువెత్తుతున్నాయి. బొగ్గు పరిశ్రమ సీఎంపీఎఫ్‌లో నిధుల దుర్వినియోగం, దాదాపు రూ.1000 కోట్ల నిధుల గల్లంతు, పెట్టుబడులు పెట్టిన ప్రైవేటు కంపెనీలు దివాలా తీయడం వంటి పరిణామాలు వెలుగు చూస్తుండటంతో కార్మికులు, ఉద్యోగులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. భవిష్యత్తులో తమకు పింఛన్లు వస్తాయో.. లేదో.. అనే భయాలను వ్యక్తం చేస్తున్నారు.

ఇల్లెందు (భద్రాద్రి కొత్తగూడెం జిల్లా), ఆగస్టు 25: దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లో బొగ్గు పరిశ్రమల్లో పనిచేస్తున్న కార్మికులు, ఉద్యోగులకు రిటైర్‌మెంట్ అనంతరం సీఎంపీఎఫ్‌తోపాటు ప్రతి నెల పింఛన్ చెల్లిస్తారు. ఇందుకోసం ప్రతీ నెల కార్మికుల వేతనాల్లో 12 శాతం మినహాయిస్తూ అంతే మొత్తంలో బొగ్గు ఉత్పాదక కంపెనీలు 12 శాతం నిధులు సీఎంపీఎఫ్ ట్రస్ట్‌కు జమ చేస్తుంటాయి. బొగ్గు పరిశ్రమ వ్యాప్తంగా 1998 నుంచి కార్మికులకు పింఛన్ పథకాన్ని అమలు చేస్తున్నారు. ఈ పథకానికి ఆర్‌బిపిఎస్ 1 ద్వారా ఏడు శాతం, ఆర్‌బిపిఎస్ 2 ద్వారా రెండు శాతం నిధులు మొత్తం 9శాతం వాటా ధనాన్ని కార్మికుల నుంచి అంతే మొత్తంలో 9 శాతం సొమ్మును బొగ్గు ఉత్పాదక సంస్థలు జమచేస్తుంటాయి. వీటికి తోడు పింఛన్ పథకాన్ని బలోపేతం చేసేందుకు కార్మిక సంఘాల అభ్యర్థన మేరకు దేశ వ్యాప్తంగా బొగ్గు ఉత్పాదక సంస్థలు తాము ఉత్పత్తి చేస్తున్న ప్రతి టన్ను బొగ్గుకు రూ.20 చొప్పున చెల్లిస్తున్నాయి.

ఈ నిధులన్నింటినీ సీఎంపీఎఫ్ఓ, మిస్లేనియస్ ప్రొవిజన్స్ యాక్టు 1948 ద్వారా ఏర్పాటు చేసిన ప్రత్యేక సంస్థ ద్వారా పర్యవేక్షిస్తున్నారు. ఈ ట్రస్టుకు కేంద్ర ప్రభుత్వ బొగ్గు మంత్రిత్వశాఖ కార్యదర్శి చైర్మన్‌గా, సీఎంపిఎఫ్ కమిషనర్ ఎక్స్‌అఫీషియో సభ్యుడిగా, బొగ్గు మంత్రిత్వ శాఖ జాయింట్ కమిషనర్ ఆర్థిక సలహాదారుగా, మరో 11 మంది సభ్యులను నియమించారు. ఈ ట్రస్ట్ కార్మికుల సొమ్ముకు భద్రత కల్పిస్తూ ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల్లో పెట్టుబడులు పెడుతూ ఆర్థిక వనరులను పెంచుతూ కార్మికులకు ప్రావిడెంట్ ఫండ్, పెన్షన్లు చెల్లించడాన్ని పర్యవేక్షిస్తుంది.

దివాలా తీసిన పెట్టుబడుల సంస్థలు

సీఎంపిఎఫ్ఓ ద్వారా అప్పులు తీసుకున్న మూడు సంస్థలు దివాలా తీయడంతో కోట్లాది రూపాయలు గల్లంతైనట్లు కాగ్ నివేదిక బట్టబయలు చేసింది. దీనిపై నేటి వరకు కేంద్ర ప్రభుత్వం సమగ్ర విచారణ జరపక పోవడం, బాధ్యులపై చర్యలు తీసుకోకపోవడం అనుమానాలకు తావిస్తోంది. దివాలా ప్రకటించిన సంస్థల్లో పెట్టుబడులు పెట్టించిన బడా బాబులు, అదృశ్యశక్తులు ఎవరు అనే అంశాలను నిగ్గు తేల్చకపోడంతో పింఛన్ పథకాల మనుగడ ప్రశార్థకంగా మారింది. సీఎంపిఎఫ్ఓ అధికారులు దివాన్ హౌసింగ్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్ (డిహెచ్ ఎఫ్ఎల్)లో 2015 నుంచి 2018 వరకు నాన్ కన్వర్టబుల్ డివెంచర్లుగా 1390.25 కోట్లు పెట్టుబడులు పెట్టారు. ఈ క్రమంలో 2019 మార్చి 8న డిహెచ్ఎఫ్ఎల్ సంస్థ నష్టాల్లో ఉండటం డౌన్ గ్రేడింగ్ గుర్తించిన పోర్టుఫోలియో మేనేజర్లు సీఎంపిఎఫ్ఓకు ముందుగానే సమాచారం అందించారు. త్వరగా నిధులు రిడక్షన్ చేయాలని కోరారు.

అయినప్పటికీ కోల్ ఇండియా అధికారులు, సిఎంపిఎఫ్ఓ అధికారులు పట్టించుకోలేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. 2019 మార్చి 26న బోర్డు ఆఫ్ ట్రస్ట్ సమావేశం జరిగినప్పటికీ కీలక అంశమైన దివాన్‌హౌసింగ్ పెట్టుబడుల అంశాన్ని ఎజెండాలో చేర్చలేదని, కనీసం చర్చించలేదని కాగ్ తన నివేదికలో ఎత్తిచూపింది. అధికారులు, సీఎంపిఎఫ్ఓ నిర్లక్ష్యం మూలంగా దివాన్‌హౌసింగ్ కార్పొరేషన్‌లో పెట్టిన పెట్టుబడుల్లో రూ.727 కోట్ల మేర నష్టం జరిగిందని కాగ్ పేర్కొంది. అలాగే రిలయన్స్ క్యాపిటల్‌లో రూ.150 కోట్లు, ఇండియా లీజ్ అండ్ ఫైనాన్స్‌లో రూ.100 కోట్లు పెట్టుబడులు పెట్టారు. ఈ మూడు సంస్థలు కూడా నేషనల్ కంపెనీ లా ట్రిబ్యూనల్‌లో దివాలా పిటిషన్లు దాఖలు చేయడంతో బొగ్గు పరిశ్రమవ్యాప్తంగా ఆందోళన వ్యక్తం అవుతోంది.



సీబీఐ విచారణకు డిమాండ్

సీఎంపిఎఫ్ఓలో నిధుల దుర్వినియోగం, దివాలా కంపెనీల్లో పెట్టుబడులు పెట్టడంపై సీబీఐ విచారణ జరపాలని భారతీయ మజ్దూర్ సంఘ్ డిమాండ్ చేస్తోంది. దివాలా కంపెనీల్లో పెట్టుబడులకు కారకులైన వారిపై చర్యలు తీసుకోవాలని, కార్మికుల సొమ్ముకు కేంద్ర ప్రభుత్వం కోల్ ఇండియా (సీఐఎల్), సీఎంపిఎఫ్ఓ అధికారులు బాధ్యత వహించాలని బీఎంఎస్ కోరుతోంది. ఇప్పటికే దేశవ్యాప్తంగా బొగ్గు పరిశ్రమ పెన్షన్ ఫండ్ ప్రతి యేటా రూ.300 కోట్ల నష్టాలతో సాగుతోంది. సీఎంపిఎఫ్‌కు ప్రతి నెలా సభ్యులు చెల్లించే వాటా ధనం కంటే పెన్షన్ పొందే వారి సంఖ్య అధికంగా ఉండటం గమనార్హం. పెన్షన్ల మొత్తం సైతం అతి స్వల్పంగానే ఉండటం, రానున్న రోజుల్లో ఇదే పరిస్థితి కొనసాగితే మరో 10 ఏళ్ల కాలంలో సీఎంపిఎఫ్ ఆర్థిక పరిస్థితి మరింత దిగజారడం ఖాయమని, కార్మికులకు పింఛన్లుసైతం చెల్లించే పరిస్థితి ఉండదనే ఆందోళనను కార్మిక సంఘం నాయకులు వ్యక్తం చేస్తున్నారు.



పోలీస్‌శాఖకు నయా లుక్

కొత్తగా మధిర డివిజన్ ఏర్పాటు

- ఐదుకు పెరగనున్న డివిజన్ల సంఖ్య
- పోలీస్‌స్టేషన్ల డివిజన్లలోనూ మార్పులు
- పలు స్టేషన్లకు ఎస్‌హెచ్‌వోలుగా సీఐల నియామకం
- ఎంవీ పాలెం, సుబ్లేడులో నూతన పోలీస్‌స్టేషన్లు
- ఫిర్యాదుదారులకు సత్వర న్యాయమే లక్ష్యం

ఖమ్మం క్రైం, ఆగస్టు 25: ఖమ్మం జిల్లాలోని పోలీస్ డివిజన్ల పరిధిలో పలు మార్పులకు అధికారులు రంగం సిద్ధం చేశారు. ప్రస్తుతం కమిషనరేట్ పరిధిలో నాలుగు డివిజన్లు ఉండగా మరో డివిజన్ ఏర్పాటు చేసి అధికారులను నియమించేందుకు ప్రతిపాదనలు పంపారు. అదేవిధంగా జిల్లాలో రెండు చోట్ల నూతన పోలీస్‌స్టేషన్లు ఏర్పాటు చేయనున్నారు. జిల్లాలో పలు పోలీస్‌స్టేషన్లలో ఎస్‌హెచ్‌వోలుగా ఎస్ఐలు ఉండగా, వారి స్థానంలో సీఐలను నియమించనున్నారు. కాగా అధికారులు పంపిన ప్రతిపాదనల ఆధారంగా ప్రభుత్వం త్వరలో జీవో జారీ చేయనున్నట్లు సమాచారం.

మధిరకు దక్కిన ప్రాధాన్యం

ఖమ్మం కమిషనరేట్ పరిధిలో ఇప్పటివరకు నాలుగు డివిజన్లున్నాయి. ఒక్కో డివిజన్ పరిధిలో పలు పోలీస్‌స్టేషన్లు ఉన్నాయి. ఒక్కో డివిజన్‌కు ఒక ఏసీపీ ఉంటారు. కాగా, తాజాగా మధిరను కూడా నూతన డివిజన్‌గా ఏర్పాటు చేసేందుకు అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. దీంతో మధిర ఐదో పోలీసు డివిజన్‌గా ఏర్పాటు కానుంది.

రెండు నూతన పోలీస్‌స్టేషన్లు

జిల్లాలో రెండు చోట్ల నూతన పోలీస్‌స్టేషన్లు ఏర్పాటు చేసేందుకు అధికారులు ఇప్పటికే ఉన్నతాధికారులకు జూలై నెలలో ప్రతిపాదనలు పంపారు. పాలేరు నియోజకవర్గంలోని యం.వీ.పాలెం, సుబ్లేడు ప్రాంతాల్లో నూతన పోలీస్‌స్టేషన్లు ఏర్పాటు చేయనున్నారు. ఆ రెండు గ్రామాల పరిధిలో ఉన్న జనాభా ఆధారంగా రెండు మండలాలుగా ఏర్పాటు చేసేందుకు సంబంధిత అధికారులు ప్రతిపాదనలు పంపినట్లు సమాచారం. మండలానికో పోలీస్‌స్టేషన్ ఉండాలని ప్రభుత్వ నిర్ణయం మేరకు పోలీస్ అధికారులకు వచ్చిన ఆదేశాల ప్రకారం ఈ రెండు గ్రామాల్లో రెండు పోలీస్‌స్టేషన్లు ఏర్పాటు చేసేందుకు ముందుగానే ప్రతిపాదనలు పంపినట్లు తెలిసింది. కాగా ఈ రెండు పోలీస్‌స్టేషన్లు ఏర్పాటైన తరువాత ఇక్కడ కూడా ఎస్‌హెచ్‌వోలుగా సీఐలను నియమించేందుకు అధికారులు ప్రతిపాదనలు పంపినట్లు తెలిసింది.

ఎస్‌హెచ్‌వోలుగా సీఐలు


జిల్లాలో ప్రస్తుతం మొత్తం 25 పోలీస్‌స్టేషన్లు ఉండగా.. వాటిలో 11 పోలీస్ స్టేషన్లలో ఎస్‌హెచ్‌వోలుగా సీఐలను నియమించేందుకు కూడా అధికారులు ప్రతిపాదనలు గతంలోనే పంపారు. వీటిల్లో రఘునాథపాలెం, ఖమ్మంరూరల్, ముదిగొండ, వైరా, కొణిజర్ల, కారేపల్లి, సత్తుపల్లి, వీయం బంజర, కల్లూరు, మధిరటౌన్, బోనకల్ స్టేషన్లకు ఎస్‌హెచ్‌వోలుగా సీఐలను నియమించేందుకు ప్రతిపాదనలు పంపారు. ప్రస్తుతం రఘునాథపాలెం, ముదిగొండ, ఖమ్మంరూరల్ పోలీస్ స్టేషన్లకు మాత్రం సీఐలను కేటాయించారు. మిగిలిన 14 పోలీస్ స్టేషన్లలో మాత్రం ఎస్‌హెచ్‌వోలుగా ఎస్ఐలు కొనసాగనున్నారు. కాగా ఈ మార్పులకు సంబంధించి జిల్లా పోలీస్ అధికారులు ప్రతిపాదనలు మాత్రమే పంపారు. త్వరలో ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు కూడా వెలువడనున్నట్లు సమాచారం.

మారనున్న పోలీసు డివిజన్ల పరిధి

కమిషనరేట్ పరిధిలో గతంలో ఉన్న పోలీస్‌స్టేషన్లను ఆయా డివిజన్లకు కేటాయించారు. వీటిలో కొత్తగా మరో డివిజన్ ఏర్పాటు కానున్న నేపథ్యంలో మార్పులు జరగనున్నట్లు తెలుస్తోంది. ఖమ్మం టౌన్ డివిజన్‌లో ఖమ్మం వన్‌టౌన్, టుటౌన్ త్రీటౌన్, ఖానాపురంహవేలి, రఘునాథపాలెం పోలీస్‌స్టేషన్లు ఉన్నాయి. ఖమ్మంరూరల్ డివిజన్‌లో కూసుమంచి, తిరుమలాయపాలెం, నేలకొండపల్లి, ఖమ్మంరూరల్, కొత్తగా ఏర్పాటుకానున్న సుబ్లేడు, ఎంవీపాలెం పోలీస్‌స్టేషన్లున్నాయి. వైరా డివిజన్‌లో వైరా, కొణిజర్ల, ఏన్కూరు, కారేపల్లి, కామేపల్లి పోలీసుస్టేషన్లు ఉండనున్నాయి. కల్లూరు డివిజన్‌లో సత్తుపల్లి, వీఎం బంజర, వేంసూరు, కల్లూరు, తల్లాడ పోలీసుస్టేషన్లు ఉండనున్నాయి. అదేవిధంగా నూతనంగా ఏర్పాటుకానున్న మధిర డివిజన్‌లో మధిర టౌన్, మధిరరూరల్, ఎర్రుపాలెం, బోనకల్, చింతకాని, ముదిగొండ పోలీస్‌స్టేషన్లు ఉండనున్నట్లు తెలిసింది.

సత్వర న్యాయం కోసమే...

జిల్లాలో రోజురోజుకు జనాభా విస్తరిస్తున్న నేపథ్యంలో కేసుల సంఖ్య కూడా పెరుగుతోంది. దీంతో కేసులు పరిష్కరించేందుకు పోలీసు అధికారులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి గత కొంతకాలంగా కిందిస్థాయి సిబ్బంది తీసుకెళ్తున్నారు. ఈ క్రమంలో ఫిర్యాదుదారులకు సత్వర న్యాయం కోసమే అధికారులు ఎస్‌హెచ్‌వోలుగా సీఐలను నియమిస్తున్నట్లు తెలుస్తోంది. ఇక స్టేషన్లలో ఉండాల్సినదాని కంటే తక్కువ సిబ్బంది ఉన్నారు. ఈ సమస్యపై కూడా అధికారులు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లడంతో నూతన సిబ్బందిని కూడా నియమించనున్నట్లు ప్రచారం జరుగుతోంది.



ఖమ్మం గాంధీచౌక్‌లోని శ్రీకృష్ణమందిరం

గోకుల కృష్ణా.. గోపాల కృష్ణా...

ఖమ్మం ఖానాపురం హవేలి, ఆగస్టు 25: ఉమ్మడి ఖమ్మంజిల్లాలో సోమవారం శ్రీకృష్ణాష్టమి పర్వదినం ఘనంగా జరుపకోనున్నారు. శ్రీకృష్ణుని జన్మాష్టమి సందర్భంగా శ్రీకృష్ణ మందిరాలలో ప్రత్యేకపూజలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు శ్రీకృష్ణుడి, రాధాగోపికలు వేషధారణలు వేసి ప్రత్యేక కార్యక్రమాలునిర్వహిస్తారు. గ్రామాల్లో, పట్టణాల్లో యువత ఉట్టికొట్టే సంబరాలు కోలాహలంగా నిర్వహిస్తారు. ఖమ్మం నగరంలోని శ్రీకృష్ణ మందిరాలను ముస్తాబు చేశారు. గాంధీచౌక్‌లోని మురళీకృష్ణ మందిరం, 6వ డివిజన్‌లోని శ్రీకృష్ణమందిరం, ప్రకాష్‌నగర్‌లోని కృష్ణుడి మందిరంలో వేడుకలను సోమవారం తెల్లవారుజాము నుంచి రాత్రి వరకు నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తిచేశారు. గొల్లగూడెం, టేకులపల్లి గోశాలలో గోవులకు ప్రత్యేక పూజలు చేసేందుకు నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

భూముల విలువ పెంపుపై కసరత్తు

- థర్డ్‌పార్టీతో రిజిస్ట్రేషన్ శాఖ పరిశీలన
- ప్రజాభిప్రాయం మేరకే పెంపు అంటున్న అధికారులు

ఖమ్మం టౌన్, ఆగస్టు 25: స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్‌శాఖ ద్వారా ఆదాయం పెంచుకోవాలనుకున్న ప్రభుత్వం బహిరంగ మార్కెట్‌లో భూముల ధరలను సవరించాలని నిర్ణయించింది. అయితే ఎటువంటి పొరపాట్లకు తావులేకుండా ప్రస్తుతం ఉన్న భూముల ధరలపై విచారణ చేసే బాధ్యతను థర్డ్‌పార్టీకి అప్పగించనుంది. ఇప్పటికే రిజిస్ట్రేషన్, రెవెన్యూ, నగరపాలక, పురపాలకశాఖ అధికారులతో కమిటీ ఏర్పాటు చేసిన ప్రభుత్వం, ఇక భూముల ధరలు, ధరల పెంపుపై ప్రజాభిప్రాయ సేకరణ తదితర అంశాలపై థర్డ్‌పార్టీతో సర్వే చేయించనుంది. గత ప్రభుత్వం రెండుసార్లు భూముల మార్కెట్ ధరలను పెంచినప్పటికీ ప్రజల అభిప్రాయం తెలుసుకోలేదు. దీంతో పలు విమర్శలు వచ్చాయి. పెంచిన భూముల మార్కెట్ విలువ ద్వారా రిజిస్ట్రేషన్లు తగ్గినా ఆదాయం పెరిగింది. ఖమ్మం నగరం విషయం చూసుకుంటే భూముల మార్కెట్ విలువలను ఇబ్బడిముబ్బడిగా పెంచారు. ప్రభుత్వ మార్కెట్ విలువ ప్రకారం గజం రూ.5 వేలు ఉన్న ప్రాంతంలో మూడురెట్లు పెంచారు. వాణిజ్య ప్రాంతాల్లో 30నుంచి 60శాతం, కొన్ని ప్రాంతాల్లో 100 శాతం పెంచారు. దీంతో జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయంతో సహా ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెంలోని 13సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల ద్వారా ఆదాయం భారీగా వచ్చింది. స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్‌శాఖ ఏకంగా రూ.100 కోట్ల వరకు అదనంగా ఆదాయం పొందగలిగింది.



జూన్ నుంచే కసరత్తు

భూముల మార్కెట్ విలువలను పెంచాలని నిర్ణయించిన ప్రభుత్వం జూన్ 15 నుంచే కసరత్తు ప్రారంభించింది. ఈనెల 1 నుంచి పెంచిన భూముల విలువలను అమల్లోకి వస్తాయని షెడ్యూల్ ప్రకటించింది. మార్కెట్ విలువల సవరణపై స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు నివేదిక తయారుచేశారు. అయితే పూర్తిస్థాయి పరిశీలన లేకుండా భూముల మార్కెట్ విలువలు పెంచితే ఇబ్బందులు తప్పవన్న ఉద్దేశ్యంతో తిరిగి పరిశీలించేందుకు ఒక ప్రైవేట్ ఏజెన్సీకి అప్పగించారు. థర్డ్‌పార్టీ నివేదిక వచ్చిన తరువాతే భూముల ధరలు పెంచే అవకాశం ఉంది. గత ప్రభుత్వం క్షేత్రస్థాయిలో విచారణ చేయకుండా ఇష్టారీతిగా భూముల మార్కెట్ విలువలు పెంచారని విమర్శలు వచ్చాయి. అసమగ్రంగా బహిరంగ విలువ ఎక్కువగా ఉన్నచోట తక్కువ మార్కెట్ విలువ, అవసరంలేని చోట మార్కెట్ విలువను రెట్టింపు చేశారని ఆరోపణలు వచ్చాయి. దీంతో థర్డ్‌పార్టీ ద్వారా సమగ్ర విచారణ చేసిన తరువాతే భూముల మార్కెట్ విలువను పెంచాలని ప్రభుత్వ నిర్ణయించింది.



మృతులు రియాజ్, జమీర్

ప్రాణాలు బలిగొన్న చేపల వేట

- ప్రమాదవశాత్తు నీట మునిగి ఇద్దరి మృతి
- సీతారామ కాలువలో ఘటన.. కొత్తగూడెంలో విషాదం..

బూర్గంపాడు, ఆగస్టు 25: సీతారామ ప్రధాన కాలువలో సరదాగా చేపల వేటకు వచ్చిన ఇరువురు వ్యక్తులు ప్రమాదవశాత్తు నీటమునిగి మృతిచెందారు. ఈ విషాద సంఘటన ఆదివారం జింకలగూడెంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తగూడెం పట్టణంలోని బూడిదగడ్డకు చెందిన ఎస్‌కె జమీరుద్దీన్(36) ఆటో ఎలక్ట్రీషియన్ పని చేస్తున్నాడు. ఇతనికి భార్య, ముగ్గురు పిల్లలున్నారు. ఏపీలోని తెనాలికి చెందిన జమీర్ తోడల్లుడి కుమారుడు షేక్ రియాజ్ (17) కొత్తగూడెంలో ఐటీఐ చదువుకుంటూ జమీర్ ఇంటి వద్దనే ఉంటున్నాడు. ఆదివారం ఇద్దరు కలిసి ద్విచక్ర వాహనంపై బూర్గంపాడు మండల పరిధిలోని జింకలగూడెం గ్రామం వద్ద ఉన్న సీతారామ కాలువలో చేపల వేటకు వెళ్లారు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు కాలువలో పడి మృతి చెందారు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న ఎస్ఐ రాజేష్, భద్రాచలం అగ్నిమాపక సిబ్బంది గజ ఈతగాళ్ల సహాయంతో మృతదేహాలను వెలికితీసి భద్రాచలం ఏరియా ఆసుపత్రికి తరలించారు. సంఘటన స్థలాన్ని పాల్వంచ సీఐ వినయ్‌కుమార్ సందర్శించి ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. మృతుడు జమీర్ భార్య షహీనా ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాలువ లోతు అంచనా వేయలేకపోవడం, అడుగునా రాళ్లు, పాచి ఉండడంతో మృతి చెంది ఉంటారని స్థానికులు పేర్కొంటున్నారు.

రాజకీయ కక్షల కోసమే 'హైడ్రా'

- పర్యావరణ పరిరక్షణ పేరుతో చట్టాల బేఖాతరు
- మోదీ దిష్టిబొమ్మ దహనం చేస్తే కేసులు లేవు
- ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేస్తే మాపై కేసులా..
- బీజేపీ నేతలు, మాజీ ఎమ్మెల్సీలు రామచంద్రరావు, పొంగులేటి సుధాకర్‌రెడ్డి

ఖమ్మం బైపాస్‌రోడ్, ఆగస్టు 25: పర్యావరణ పరిరరక్షణ పేరుతో ఏర్పాటుచేసిన హైడ్రా కేవలం రాజకీయ కక్షలు తీర్చుకొనేందుకేనని బీజేపీ నాయకులు, మాజీ ఎమ్మెల్సీలు రామచంద్రరావు, పొంగులేటి సుధాకర్‌రెడ్డి ఆరోపించారు. ఖమ్మంనగరంలోని ఓ హోటల్‌లో ఆదివారం సభ్యత్వ నమోదు కార్యశాల కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన మాజీ ఎమ్మెల్సీలు రామచంద్రరావు, పొంగులేటి సుధాకర్‌రెడ్డిలు మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 8నెలలు పూర్తయినా హామీల అమల్లో విఫలమైందన్నారు. రూ.2లక్షల రుణమాఫీ రైతులందరికీ చేస్తామని కేవలం 30 నుంచి 40శాతం మాత్రమే మాఫీచేశారని, దీని గురించి రైతులు ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వం మాత్రం పట్టించుకోవడంలేదన్నారు. కాంగ్రెస్ పార్టీ మంత్రులు ఒకరికి పోటీగా ఒకరు ప్రచారాలు చేస్తున్నారే తప్ప ప్రజాసమస్యలు పట్టించుకోవడంలేదన్నారు. బీఆర్ఎస్ ఏవిధంగా అవినీతి, అక్రమాలకు పాల్పడుతుందో అదేవిధంగా ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఆ విధంగా చేస్తుందన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రధాని మోదీ దిష్టిబొమ్మ దహనం చేస్తే పోలీసులు కేసులు నమోదు చేయలేదని, కానీ బీజేపీ నాయకులు రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తే కేసులు నమోదుచేసి ఇబ్బందులుపాలు చేయడం అన్యాయమన్నారు. చట్టం అందరికీ వర్తింపచేసే విధంగా పోలీసులు వ్యవహరించాలని అన్నారు. అదేవిధంగా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రతి కార్యకర్త దేశంలో ప్రధాని మోదీ చేస్తున్న అభివృదిని ప్రజల వద్దకు తీసుకెళ్లి సభ్యత్వాలు చేర్పించాలన్నారు. ఎవరైనా బీజేపీ సభ్యత్వం ఎందుకు తీసుకోవాలని అడిగితే వారికి బీజేపీ అన్నది చేస్తుందని, ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో ముందుంటుందని చెప్పి వారికి కేంద్రం చేసిన అభివృద్ధి కార్యక్రమాలు వివరించాలన్నారు. కూలీలు, రైతులవద్దకు వెళ్లి వారికి అభివృద్ధి గురించి వివరించి సభ్యత్వాల నమోదుకు కృషిచేయాలన్నారు.



మాట్లాడుతున్న బీజేపీ నేత పొంగులేటి సుధాకర్‌రెడ్డి

2014లతో జరిగిన సభ్యత్వ నమోదులో రాష్ట్రవ్యాప్తంగా సుమారు 11 లక్షల సభ్యత్వాలు నమోదయ్యాయని, ఇప్పుడు వాటికంటే భారీస్థాయిలో సభ్యత్వలు జరగనున్నాయని అందుకు ప్రతి కార్యకర్త, నాయకులు కృషిచేయాలని తెలిపారు. సభ్యత్వనమోదు కార్యక్రమాన్ని ఒక పండుగలా జరపాలని,, పార్టీకి కార్యకర్తలే బలమని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ, రాష్ట్ర నాయకులు సన్నె ఉదయ్‌ప్రతాప్, గంటేల విద్యాసాగర్, తాండ్ర వినోదరావు, నున్న రవికుమార్, విజయరాజు, శ్యామ్‌రాథోడ్, విజయారెడ్డి, మంద సరస్వతి, సత్యప్రసాద్, వెంకటగుప్తా, అసెంబ్లీ కన్వీనర్ అల్లిక అంజయ్య తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు బోధిస్తున్న ఉపాధ్యాయుడు ప్రసాదరావు

ఆ ఉపాధ్యాయుడి లెక్కేవేరు

- వ్యవకలనంలో ఇప్పటివరకు వున్న పద్ధతి ఊహాజనితమని వాదన
- నిర్ధారణ ఆధారంగా కొత్తపద్ధతిని పరిశీలించాలని వినతి

అశ్వారావుపేట, ఆగస్టు 25: గణితంలోని వ్యవకలనం(తీసివేత)లో కొత్త విధానాన్ని రూపొందించినట్టు చెబుతున్నారు అశ్వారావుపేట ప్రాంతానికి చెందిన ఐటీడీఏ ఉపాధ్యాయుడు ఉయ్యాల ప్రసాదరావు. వ్యవకలనం(తీసివేత)లో ఇప్పటివరకు అనుసరిస్తున్న అప్పు తెచ్చుకునే పద్ధతి ఊహాజనితం మాత్రమేనని, తాను వాస్తవిక పద్ధతిని రూపొందించానని అంటున్నారు. అధికారులు, గణిత శాస్త్ర నిపుణులు అవకాశం ఇస్తే నిరూపిస్తానని చెబుతున్నారు.

వ్యవకలనంలో తక్కువ అంకె నుంచి ఎక్కువ అంకెను తీసివేసే సమయంలో పక్క స్థానం నుండి ఒకటిని అప్పు తెచ్చుకొని దానిని పదిగా భావించి కింద సంఖ్యను అందులోనుండి తీసివేస్తారు. అప్పు తీసుకున్న స్థానంలో ఒకటిని మాత్రమే తీసివేస్తారు. అంటే ఇది ఊహాజనితం మాత్రమే. పక్క స్థానంలో ఒకటిని అప్పుగా తెచ్చుకొని పదిగా ఊహించుకుంటారు. ఇది నిర్ధారణ కాదు అంటున్నారు ప్రసాదరావు. పది అప్పు తెచ్చుకున్నట్టు చూపించినప్పుడు, దానిని నిజంగా చూపించినప్పుడే వాస్తవికతకు అద్దం పడుతుందని, అదే నిర్ధారణ అని అంటున్నారు. అది ఎలాగో ఆయన కొత్త గా రూపొందించిన లెక్కల్లో చేసి చూపించారు. ఆయన చెప్పిన నూతన విధానం గురించి తెలుసుకుందాం....

ప్రస్తుత విధానం...

320-241=079. ఇక్కడ సున్న నుంచి ఒకటి తీసివేయలేం. కనుక పక్క స్థానమైన పదులస్థానంలోని రెండు అంకె నుంచి నుండి ఒకటిని అప్పుగా తెచ్చుకుంటారు. దీనిని పదిగా భావించి దానికి ఒకట్ల స్థానంలో ఉన్న సున్నను కలిపి మొత్తం పదిగా భావిస్తారు. పదిలో కింది ఉన్న ఒకటిని తీసివేస్తే తొమ్మిది వస్తుందని చెబుతారు. పదుల స్థానంలో వున్న రెండు అంకె నుంచి ఒకటి పోయింది కనుక, ఒకటి మిగిలిందని చెప్పి మరలా వందల స్థానం నుంచి ఒకటిని అప్పుగా తెచ్చుకొని పదుల స్థానంలో ఉన్న ఒకటికి కలిపి 11 గా భావించి, అందులో నుండి కింద ఉన్న నాలుగును తీసివేసి ఏడు ఉంటుందని చెబుతారు. అప్పుడు వందల సంఖ్యలో మూడు నుంచి ఒకటి తగ్గించి రెండు ఉందని చెబుతారు. అందులో కింది ఉన్న రెండు తీసివేయడం ద్వారా సున్న వస్తుంది. ఇది ఇప్పటి వరకు మనం చేసిన తీసివేత పద్ధతిలో ఒకటిని అప్పుగా తీసుకొచ్చినట్టు చెపుతూనే పది తీసుకొచ్చినట్టుగా భావించి తీసివేయమని విద్యార్థులకు చెబుతారు. అంటే ఇది ఊహించుకోవడమేనని ఆయన అంటున్నారు.

అవగాహనకు నిర్ధారణకు తేడా....

పదుల, వందల, వేల స్థానంపైన వేసుకున్న పది పదులు, వందల, వేల స్థానంలో ఉన్నట్టు కాదు. నిర్ధారణ అంటే పదుల, వందల వేల స్థానాల్లో నుండి పదిని ఎలా అప్పుగా తెచ్చుకున్నామో బోర్డుపై చూపడం. ప్రసాదరావు చూపిన ఉదాహరణ లెక్కల్లో పదిని పక్కస్థానం నుంచి ఎలా తెచ్చుకున్నామో చూపుతున్నారు. నిర్ధారణ విధానంలో రూపొందించిన తీసివేత లెక్క ఇలా వుంది..

320-249=071... ఎలా చేయాలంటే...

స్టెప్ 1: పదుల స్థానంలో ఉన్న 20ని పదవ భాగమైన రెండు చే భాగిస్తే (20/2) పది వస్తుంది. దీనికి ఒకట్లు స్థానంలో సున్నను కలపితే పది అవుతుంది. 10-9 తీసివేస్తే ఒకటి జవాబు.

స్టెప్ 2: వందల స్థానంలో మూడొందలను పదవ భాగం 30చే భాగిస్తే పది వస్తుంది. ఈ పదికి పదుల స్థానంలో మిగిలిన ఒకటి కలిపితే పదకొండు వస్తుంది. 11-4= 7

స్టెప్ 3: వందల స్థానంలో రెండు మిగిలి వుంది. ఈ రెండు నుంచి కింద సంఖ్య రెండును తీసివేస్తే సున్న (2-2=0) వస్తుంది. మొత్తం జవాబు 071 వస్తుంది.



అడవిని నరుకుతున్న వ్యక్తులు

అగ్గి రాజేస్తున్న

పోడు వివాదాలు

- వన సంరక్షణకు ప్రాధాన్యం ఇస్తున్న ప్రభుత్వం
- అటవీ భూముల్లోని చెట్లపై గొడ్డలి వేటు
- భవిష్యత్తులో హక్కులు వస్తాయని ఆశ
- తిరిగి స్వాధీనం చేసుకుంటున్న అటవీశాఖ
- అటవీశాఖ ఉద్యోగులపై పోడు సాగుదారుల దాడులు
- ఇప్పటికే పోలీసు కేసుల నమోదు

ఖమ్మం సంక్షేమ విభాగం, ఆగస్టు 19: ప్రకృతి సంరక్షణలో వనసంరక్షణ ఎంతో కీలకమైనది. కేంద్ర, రాష్ట్రంలో ఏ ప్రభుత్వాలు అధికారంలో ఉన్నా కూడా వన సంరక్షణకు అధిక ప్రాధాన్యం కల్పిస్తాయి. బీఆర్ఎస్ ప్రభుత్వంలో తెలంగాణకు హరితహారం పథకంతో జిల్లాలో కోట్ల మొక్కలను నాటారు. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వంలోను వన మహోత్సవం పథకంతో లక్షల మొక్కలను జిల్లాలో ఒక వైపు నాటుతున్నారు. పోడు పేరిట పలువురు ఆక్రమించుకున్న భూములను తిరిగి స్వాధీనం చేసుకోవడానికి అటవీ శాఖ అధికారులు సన్నద్ధం అవుతున్నారు. ఈ క్రమంలో పోడుదారులకు, అటవీ శాఖ ఉద్యోగులకు మధ్య వాగ్వాదం, దాడులు సాగుతున్నాయి. ఈ క్రమంలో ఇప్పటికే పోలీసు కేసులు కూడా నమోదయ్యాయి.

యూపీఏ ప్రభుత్వంలో అటవీ హక్కుల చట్టం

దశాబ్దాలుగా పోడు భూములు సాగు చేస్తున్న గిరిజనులు, గిరిజనేతరులకు గత యూపీఏ ప్రభుత్వంలో 2005న అటవీ హక్కుల చట్టం రూపొందించారు. ఈ చట్టం మేరకు 2005డిసెంబరు 12కు ముందు సాగుచేసిన భూములకు హక్కు పత్రాలను ఇవ్వాలని చట్టంలో పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే రెండు పర్యాయాలు పోడు భూములకు హక్కు పత్రాలను పంపిణీ చేశారు. అటవీ హక్కుల చట్టం ద్వారా పోడు సాగు చేస్తున్న సాగుదారులకు హక్కు పత్రాలను పంపిణీ చేశారు. అటవీ భూములకు హద్దులను ఏర్పాటు చేశారు.

అటవీ భూములపై గొడ్డలి వేటు

కార్పొరేషన్‌లు, స్వచ్ఛంద సంస్థలు వనాల పెంపునకు ముందుకు వచ్చి ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నాయి. దీంతో గ్రామీణ, అర్బన్ ప్రాంతాల్లో మొక్కల నాటటం వాటిని సంరక్షించటంపై సమాజంలో విప్లవాత్మక మార్పులు వచ్చాయి. మరో వైపు రెండు నెలలుగా కొణిజర్ల, రఘునాథపాలెం, సింగరేణి అటవీ ప్రాంతాల పరిధిలో యథేచ్ఛగా అటవీ భూముల్లోకి రాత్రి సమయంలో కొంత మంది పోడు చేయడానికి వనాలను కొట్టివేస్తున్నారు. ఫారెస్ట్ భూముల్లోకి వెళ్లి పదేళ్లుగా తెలంగాణ హరితహరంలో నాటిన చెట్లను నరుకుతున్నారు. నరికిన ప్రాంతంలో సాగుకు అనుకూలంగా మారేందుకు నిప్పు పెట్టి కాల్చి వేస్తున్నారు. అటవీ భూములు నరికితే భవిష్యత్‌లో పోడు హక్కు పత్రాల వస్తాయని భావిస్తున్నారు. దీంతో వనాలు నరికిన ప్రాంతాన్ని తిరిగి అటవీశాఖ అధికారులు స్వాధీనం చేసుకుంటున్నారు. ఈక్రమంలో పోడు కొట్టే వారికి, అటవీశాఖ ఉద్యోగులకు మధ్య వివాదాలు ఏర్పడుతున్నాయి. కొణిజర్ల మండలంలో అటవీ భూముల నరికివేతపై అడ్డపడిన మహిళ బీట్ ఆఫీసర్‌పై దాడులు జరిగాయి. కొణిజర్ల, సింగరేణి మండలాల్లో అటవీశాఖ అధికారులు పోడు నరికే వారిపై 20కు పైగా కేసులు పెట్టారు. అయినా పోడుపై వేటు ఆగటం లేదు. ఇప్పటికే 50ఎకరాలకు పైగా పైగా పోడు భూములు నరికినట్లు అటవీశాఖలో చర్చ జరుగుతోంది.



అడవిని దహనం చేసిన దృశ్యం

వైరా పోలీసు డివిజన్ మార్పు

- 25ఏళ్ల క్రితం మధిర, వైరా స్టేషన్లతో ఏర్పాటు
- ప్రస్తుతం నియోజకవర్గాల స్థాయిలో పరిధి కుదింపు
- కొత్తగా ఏర్పడనున్న మధిర డివిజన్

వైరా, ఆగస్టు 25: ఖమ్మం పోలీస్ కమిషనరేట్ పరిధిలో 25సంవత్సరాల కిందట ఏర్పడిన వైరా పోలీస్ సబ్‌డివిజన్ పరిధి మారుస్తూ ప్రభుత్వానికి ప్రతిపాదనలు వెళ్లాయి. కొద్దిరోజుల్లో డివిజన్ పరిధి మార్పు ఉత్తర్వులు వెలువడే అవకాశముంది. 1999 డిసెంబరులో వైరా పోలీసు డివిజన్ ఏర్పడింది. మన్యం ప్రాంతంలోని వెంకటాపురంలో ఉన్న పోలీస్ సబ్ డివిజన్‌ను ఎత్తివేసి వైరాలో పోలీసు డివిజన్‌ను ఏర్పాటుచేశారు. ఆసమయంలో మధిర నియోజకవర్గ పరిధిలో ఉన్న వైరా, తల్లాడ, బోనకల్, మధిర, ఎర్రుపాలెం పోలీస్‌స్టేషన్లతోపాటు సుజాతనగర్, ఖమ్మం నియోజకవర్గాల పరిధిలోని కొణిజర్ల, చింతకాని మండలాల్లోని పోలీస్‌స్టేషన్లను ఈ డివిజన్ పరిధిలో చేర్చారు. వైరా, మధిర పోలీసు సర్కిల్ కార్యాలయాలుగా ఏర్పాటుచేసి నాలుగు పోలీస్‌స్టేషన్ల చొప్పున వాటి పరిధిలో చేర్చారు. వైరా సర్కిల్ పరిధిలో వైరా, తల్లాడ, కొణిజర్ల, చింతకాని పోలీస్ స్టేషన్లు, మధిర సర్కిల్ పరిధిలో మధిర టౌన్, రూరల్, బోనకల్, ఎర్రుపాలెం మండలాలను చేర్చారు.

2009లో ఏర్పడిన అసెంబ్లీ నియోజకవర్గాల తర్వాత వైరా పోలీస్ సబ్‌డివిజన్ పరిధిలోకి వైరా నియోజకవర్గంలోని వైరా, కొణిజర్ల, సత్తుపల్లి నియోజకవర్గంలోని తల్లాడ పోలీస్‌స్టేషన్లతోపాటు మధిర నియోజకవర్గంలోని మధిర టౌన్, రూరల్, ఎర్రుపాలెం, బోనకల్, చింతకాని పోలీస్‌స్టేషన్లుగా రూపాంతరం చెందాయి.

తెరమీదికి భట్టి ప్రతిపాదనలు..

ఉమ్మడి ఏపీలోనే ప్రస్తుత డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క డిప్యూటీ స్పీకర్‌గా ఉన్న సమయంలోనే నియోజకవర్గాల స్థాయిలో పోలీస్ డివిజన్ ఏర్పాటుచేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. దానిలో భాగంగానే ప్రత్యేక మధిర పోలీసు సబ్‌డివిజన్ కోసం ప్రతిపాదనలు వెళ్లినప్పటికీ ఆతర్వాత ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పాటుకావడం, పదేళ్లపాటు బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారాన్ని చెలాయించటం జరిగింది. తొమ్మిదినెలల కిందట జరిగిన ఎన్నికల్లో మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడం, మల్లు భట్టి విక్రమార్క డిప్యూటీ సీఎం కావడంతో మధిర పోలీసు సబ్‌డివిజన్ ప్రతిపాదనలు తెరపైకి వచ్చాయి. ఇప్పుడు మధిర నియోజకవర్గ పరిధిలోని ముదిగొండ, చింతకాని, మధిర టౌన్, రూరల్, బోనకల్, ఎర్రుపాలెం పోలీస్‌స్టేషన్లతో మధిర డివిజన్ ఏర్పాటుకు మార్గం సుగమమైంది.

నాలుగు నుంచి ఐదుకు పెరుగనున్న సంఖ్య

ఒక్క ముదిగొండ పోలీస్‌స్టేషన్ మినహామిగిలిన ఐదు పోలీస్‌స్టేషన్లు ప్రస్తుతం వైరా పోలీసు సబ్‌డివిజన్‌లో ఉన్నాయి. ఇప్పుడు ఈ ఐదు పోలీస్‌స్టేషన్లను కొత్తగా ఏర్పడే మధిర డివిజన్‌లోకి వెళ్తుండటంతో వైరా పోలీసు డివిజన్ పరిధి పూర్తిగా మారిపోనుంది. ప్రస్తుతం ఉన్న పోలీస్ డివిజన్‌లోని వైరా, కొణిజర్ల పోలీస్‌స్టేషన్లు మాత్రమే ఉండనున్నాయి. ఇప్పుడు కొత్తగా వైరా నియోజకవర్గ పరిధిలోని ఏన్కూరు, కారేపల్లి పోలీస్‌స్టేషన్లతోపాటు ఇల్లెందు నియోజకవర్గ పరిధిలోని కామేపల్లి పోలీస్‌స్టేషన్, వైరా, కొణిజర్ల పోలీస్‌స్టేషన్లతో వైరా డివిజన్ పరిధిని నిర్ధారిస్తూ ప్రభుత్వానికి ప్రతిపాదనలు వెళ్లాయి. ప్రస్తుతం ఏన్కూరు పోలీస్‌స్టేషన్ కల్లూరు పోలీసు డివిజన్ పరిధిలో, కారేపల్లి, కామేపల్లి పోలీస్‌స్టేషన్లు ఖమ్మం రూరల్ పోలీసు డివిజన్ పరిధిలో ఉన్నాయి. ఇప్పుడా మూడు పోలీస్‌స్టేషన్లు వైరా డివిజన్‌లోకి రానున్నాయి. వైరా నియోజకవర్గ పరిధిలోని జూలూరుపాడ్ మండలం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పరిధిలో ఉన్నందున అది ఖమ్మం పోలీస్ కమిషనరేట్ పర్యవేక్షణలో లేకుండాపోయింది. దాని స్థానంలో ఇల్లెందు నియోజకవర్గంలోని కామేపల్లి వైరా డివిజన్‌లోకి రానుంది. అంతేకాకుండా వైరా, కొణిజర్ల, కారేపల్లి పోలీస్‌స్టేషన్ల స్థాయి పెరగనుంది. ఈ మూడు పోలీస్‌స్టేషన్ల ఎస్‌హెచ్‌వోలుగా సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు(సీఐ) ఉంటారు. కామేపల్లి, ఏన్కూరు పోలీస్‌స్టేషన్ల ఎస్‌హెచ్‌వోలుగా సబ్‌ఇన్‌స్పెక్టర్(ఎస్ఐ)లుమాత్రమే కొనసాగనున్నారు.



పోలీస్ సబ్‌డివిజన్ కార్యాలయం

కొనసాగుతున్న శ్రీమద్భాగవత సప్తాహం

భద్రాచలం, ఆగస్టు 25: భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్ర స్వామి వారి ఆలయంలో శ్రీమద్భాగవత సప్తాహం భక్తిప్రపత్తులతో కొనసాగుతోంది. మూడో రోజైన ఆదివారం తొలుత ఆరాధన, సేవాకాలం, మంగళశాసనం నిర్వహించారు. అనంతరం గోపూజ, చతుస్థానార్చనం, శ్రీమద్భాగవత దశమ స్కంధ హోమం, నిత్యపూర్ణాహుతి తీర్థ ప్రసాద వినియోగం చేశారు. సాయంత్రం ఆహోబిల రామానుజ జీయర్‌స్వామి శ్రీమద్భాగవత ప్రవచనం చేశారు. ఇదిలా ఉండగా భద్రాద్రి రామయ్యను హైదరాబాద్ పోలీసు జాయింట్ కమిషనర్ గజరావ్‌భూపాల్ కుటుంబ సమేతంగా స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా దేవస్థానం అధికారులు ఆయనకు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలుకగా ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. దేవస్థానం తరపున స్వామి వారి ప్రసాదం, జ్ఞాపికను దేవస్థానం పర్యవేక్షకులు లింగాలసాయిబాబా అందజేశారు. కాగా రామాలయంలో ఆదివారం నిత్యకల్యాణంలో 75 జంటలు పాల్గొన్నాయి.



నిత్యకల్యాణంలో పాల్గొన్న భక్తులు

ఎన్ఎండీసీ మారథాన్‌లో కానిస్టేబుల్ దంపతులకు గోల్డ్ మెడల్



గోల్డ్‌మెడల్ సాధించిన కానిస్టేబుల్ దంపతులు

ఖమ్మం రూరల్, ఆగస్టు 25: ఎన్ఎండీసీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో ఆదివారం నిర్వహించిన మారథాన్‌లో మద్దులపల్లి గ్రామానికి చెందిన రేగళ్ల గోపీ, బీరెల్లి లక్ష్మి దంపతులు గోల్డ్ మెడల్ సాధించారు. గోపీ 42.2 కిలోమీటర్ల పరుగు పందెంలో 4.17 నిమిషాల్లో విజయం సాధించగా లక్ష్మి 21.1 కిల్లోమీటర్ల రేంజ్లో 2.38 నిమిషాల సమయంలో గమ్యం చేరుకు ని విజయం సాధించారు. దంపతులిద్దరూ గోల్డ్ మెడల్ కైవసం చేసుకున్నారు. దంపతులు ఇద్దరూ కానిస్టేబుల్స్ గా ఉద్యోగం చేస్తున్నారు. గోపి ప్రస్తుతం రూరల్ మండలంలో గన్‌మెన్‌గా పనిచేస్తుండగా, లక్ష్మి తిరుమలాయపాలెం పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నారు.

నేటి గిరిజన దర్బార్ రద్దు

భద్రాచలం, ఆగస్టు 25: భద్రాచలంలోని ఐటీడీఏ కార్యాలయంలో నిర్వహించే గిరిజన దర్బార్ రద్దు చేస్తున్న భద్రాచలం ఐటీడీఏ పీవో బి.రాహుల్ తెలిపారు. శ్రీకృష్ణ జన్మాష్టమి సెలవుదినం కావడంతో ఐటీడీఏ యూనిట్ అధికారులు, సిబ్బంది అందుబాటులో ఉండని కారణంగా గిరిజన దర్బారు రద్దు చేస్తున్నట్లు తెలిపారు.

నేడు, రేపు సోషల్‌మీడియా శిక్షణ తరగతులు

ఖమ్మంటౌన్, ఆగస్టు 25: నగరంలోని సీపీఎం జిల్లా కార్యాలయం సుందరయ్యభవన్‌లో సోమ, మంగళవారాల్లో సోషల్ మీడియా రాష్ట్రస్థాయి శిక్షణాతరగతులు నిర్వహిస్తున్నట్లు జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ వై.విక్రమ్ తెలిపారు. ఈ తరగతుల్లో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, రాష్ట్ర నాయకులు ఎండీ.అబ్బాస్, బండారు రవికుమార్, జగదీష్, ప్రవీణ్, పిట్టల రవి, సుందర్ పాల్గొని అంశాలపై బోధిస్తారన్నారు.

డేంజర్.. యమ డేంజర్..

- ఆ మరణాలకు కారణం ఎవరు ?
- నిత్యం ప్రమాదాలకు నిలయంగా సత్తుపల్లి
- అడ్డగోలు పార్కింగ్‌లు, అజాగర్త.. అతివేగమే కారణాలు
- ప్రమాదాలపై అవగాహన కల్పించని యంత్రాంగం

సత్తుపల్లిరూరల్, ఆగస్టు 25: ఒకరు పాఠశాల ముగియడంతో బయటకు వచ్చి కొద్దిదూరంలోని తన స్వగ్రామానికి వెళ్తున్నాడు. మరో ఇద్దరు బంధువుల ఇంట ఒకరు మృతిచెందగా దశదిన కర్మలో పాల్గొన్నారు. ఈ ముగ్గురుని మృత్యువు వెంటాడిది. బాలుడు బండి ఎక్కిన నిమిషంలోనే అతివేగానికి బలవ్వగా మరో ఇద్దరు స్వీయతప్పిదమో.. రోడ్డుపై అజాగ్రత్తగా నిలిపి ఉంచిన లారీనా... అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఈనెల 1వ తేదీన గంగారంలో ముగ్గురు మరణాలకు కారణం ఎవరనే ప్రశ్న తలెత్తగా అతివేగంగా ప్రధానంగా చెబుతున్నారు.

భయానకం కలిగిస్తున్న ప్రమాదాలు

భయానకం కలిగించే రోడ్డు ప్రమాదాలు నిత్యం చోటుచేసుకుంటున్నారు. కొన్ని స్వీయ తప్పిదాల వలన అయితే మరికొన్ని అజాగ్రత్త కాగా.. మరో ప్రధాన కారణం అతివేగం. నిర్లక్ష్యంతో కూడిన డ్రైవింగ్ కారణంగా పదుల సంఖ్యలో ప్రాణాలు పోతుండగా అమాయకులు అంగవికలురుగా మిగులుతున్నారు. ఆ కుటుంబాల క్షోభకు కారణం మానవ తప్పిదాలే అయినా కాస్తంతా జాగ్రత్త పాటించి వేగం తగ్గిస్తే ప్రమాదాలు అనేవి ఆగకపోయినా నష్ట నివారణ మాత్రం తగ్గించవచ్చని వైద్యులు, ప్రజాసంఘాలు అంటున్నాయి. అతివేగంగా వెళ్తూ కార్‌తో పాటు స్కూటీని ఓవర్ టేక్ చేసి అజాగ్రత్తగా వెళ్తున్న వీరు ఎదురుగా ఆపి ఉంచిన వాహనం గమనించలేకపోయారు. ఈ క్రమంలో ఎడమ వైపు వెళ్లేందుకు వీలులేక కుడి వైపు తిప్పగా కొద్ది క్షణాల్లో లారీ వెనుక భాగాన్ని ఢీకొట్టారు. క్షణాల వ్యవధిలోనే ముగ్గురు ప్రాణాలు గాలిలో కలిశాయి.

భయంకొల్పిన భీతావహ దృశ్యాలు

ముగ్గురు శరీరాలు ఛిద్రమై చెల్లాచెదురుగా పడ్డాయి. తలలు పగిలి మాంసపు ముద్దలతో రోడ్డంతా నిండిపోయింది. రక్తపు మడుగులో ఆ ప్రాణాలు కొట్టుకుంటుంటే ఆ దృశ్యాలను చూసిన వారంతా కన్నీళ్ల పర్యంతమవ్వగా తల్లీదండ్రులు, బంధువుల ఆర్తనాదాలతో సంఘటనా స్థలం బీతావహంగా మారింది. ఆ దృశ్యాలను చూసిన వారంతా పగవారికి కూడా ఇలాంటివి జరగ కూడదంటూ ప్రార్థించడం కనిపించింది. ప్రాణాలు పోతున్న సంబంధిత యంత్రాంగం పట్టించుకోవడం లేదని, మైనర్లకు వాహనాలు ఇవ్వడం, ఎలాంటి ధ్రువపత్రాలు లేకుండా నడపడం, వాహనదారులకు ప్రమాదాలపై అవగాహన కల్పించడం, అడ్డగోలుగా, అజాగ్రత్తగా రోడ్లవెంట లారీలను పార్కింగ్ చేయడం, అతివేగంగా వెళ్లడం తదితర అంశాలపై అవగాహన కల్పించకనే ప్రమాదాలు జరుగుతున్నాయని ప్రజాసంఘాలు ఆరోపిస్తున్నాయి.



ప్రమాదస్థలంలో చెల్లచెదురుగా మృతదేహాలు (ఫైల్)

చాయ్ లేదు.. బిస్కెట్ లేదు..

'ప్రజావాణి'లో అధికారులకు నో రిఫ్రెష్

ఖమ్మం కలెక్టరేట్, ఆగస్టు 25: ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం అది. దాదాపు 60మంది అధికారులు.. కలెక్టర్‌తో సహా మరో ముగ్గురు జిల్లా ఉన్నతాధికారులు పాల్గొంటారు.. ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు కొనసాగుతుంది. ఇలాంటి కార్యక్రమంలో ఒక చాయ్ లేదు.. బిస్కెట్ లేదు.. కనీసం అధికారులకు రిఫ్రెష్ లేకపోవడం విస్మయాన్ని కలిగిస్తోంది. గత కొన్నేళ్లుగా ప్రజావాణి కార్యక్రమాన్ని కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్, అదనపు కలెక్టర్లు, ఆర్డీవోతోపాటు కనీసం 50ప్రభుత్వ శాఖల జిల్లా అధికారులు పాల్గొంటారు. ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 2గంటలు.. అర్జీదారులు ఎక్కువగా వస్తే మరో గంటపాటు కనీసం 3గంటలకు ముగుస్తుంది. అలాంటి ఈ కార్యక్రమానికి అధికారులకు కనీసం మంచినీళ్లు అదీ కూడా మిషన్ భగీరథ నీళ్లు తప్ప.. ఒక్క టీ ఇవ్వడం లేదు.. బిస్కెట్ ఇవ్వడం లేదని వాపోతున్నారు.



ప్రజావాణిలో హాజరైన అధికారులు

గతంలో చాయ్ బిస్కెట్...

గతంలో జిల్లా పరిషత్ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించినప్పుడు అధికారులకు బిస్కెట్, టీ ఇచ్చేవారు. కానీ క్రమేణా రిఫ్రెష్‌మెంట్‌కు బ్రేక్ పడింది. కొత్త కలెక్టరేట్‌కు వచ్చిన తర్వాత టీ మాత్రం అందించే వారు. కానీ ఇటీవలి కాలంలో కలెక్టరేట్‌లో క్యాంటీన్ తీసేసిన తర్వాత ఆ టీకి కూడా దిక్కు లేకుండా పోయింది. అధికారులు బయటకు వెళ్లి టీ తాగడానికి కూడా సదుపాయం లేకపోవడంతో విస్మయాన్ని వ్యక్తం చేస్తున్నారు. ప్రజాప్రతినిధులు.. ఇతరత్రా సమీక్ష సమావేశాలకు మాత్రం టీలు, స్నాక్స్ అందించే అధికారులు... ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణికి మాత్రం టీ, బిస్కెట్ లేకపోవడం పట్ల అధికారులు మాకు అంత సీన్ లేదా అని ప్రశ్నిస్తున్నారు.



బీపీ మండల్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ప్రజాసంఘాల నేతలు

మండల్ స్ఫూర్తి బీసీల ఐక్యతకు నాంది కావాలి

ఖమ్మంచర్చికాంపౌండ్, ఆగస్టు25: బీసీల సాధికారతకు, బీసీల రిజర్వేషన్ సాధనకు కృషిచేసిన బీపీ మండల్ స్ఫూర్తి బీసీల ఐక్యతకు నాంది పలకాలని, వీరనారీమణుల ఆశయ సాధనసమితి గౌరవసలహాదారుడు రిటైర్డు సీఐ పుల్లయ్య అన్నారు. ఆదివారం నగరంలోని సంఘం కార్యాలయంలో బీపీ మండల్ జయంతి వేడుకలు నిర్వహించారు. తొలుత మండల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగినసభలో ఆయన మాట్లాడుతూ సమాజంలో సగభాగంగా ఉన్న బీసీల సాధికారతతోనే సామాజిక సాధికారత సాధ్యమవుతుందన్నారు. బీసీల సాధికారిత, బీసీల రిజర్వేషన్ల కోసం బీపీ మండల్ తన జీవితాన్ని అంకితం చేశారన్నారు. ఆయన స్ఫూర్తితో బీసీలు సామాజిక సాధికారిత కోసం రాజకీయాలకతీతంగా ఉద్యమించాలన్నారు. ఈకార్యక్రమంలో లంబాడీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు బానోతు బద్రునాయక్, ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనారిటీ ప్రజాసంఘాల ఐక్యవేదిక జిల్ల కన్వీనర్ షేక్ నజీమా, మామిడాల ఝాన్సీ, జాన్‌బీ, త్రివేణి, జ్యోతి, భవాని, నాగమణి, లలిత తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి

రఘునాథపాలెం, ఆగస్టు 25: ప్రభుత్వాలు మారినా కేజీబీవీలో పనిచేస్తున్న టీచింగ్, నాన్ టీచింగ్, సిబ్బంది వేతనాల్లో ఎటువంటి మార్పులు రాలేదని, భేషరుతుగా ఉద్యోగులు, సిబ్బందిని రెగ్యూలర్ చేయాలని, సమస్యల పరిష్కారం కోసం ఈనెల 30న చలో హైదరాబాద్ కార్యక్రమానికి పిలుపు ఇవ్వటం జరిగిందని ఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి జీ రామయ్య పేర్కొన్నారు. ఆదివారం రఘునాథపాలెం కేజీబీవీలో నిర్వహించిన సంఘం సమావేశంలో ఆయన చలో హైదరాబాద్ గోడపత్రికను విడుదల చేశారు. కేజీబీవీ సంఘం రాష్ట్ర నాయకులు ఆవుల అశోక్ మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా పనిచేస్తున్న నాన్ టీచింగ్ సిబ్బందికి కనీస గుర్తింపు ఇవ్వలేదని ఇప్పుడు 65ఏళ్ల వయస్సు నిబంధనలు పెట్టి దుర్మార్గంగా ఉద్యోగాల నుంచి తొలగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అలా తొలగించిన వారికి ప్రభుత్వం పదవీ విరమణ బెనిఫిట్ రూ.5లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉద్యోగం నుంచి తొలగించిన వారి కుటుంబ సభ్యులకు ఉద్యోగం ఇవ్వాలని కోరారు. చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. నాయకులు నాగలక్ష్మి, శిరీష, సంధ్య, శ్రీను, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

'గూడెం' వైద్యకళాశాల వెతలు

- ఏర్పాటు చేసి రెండేళ్లవుతున్నా పూర్తికాని నిర్మాణాలు
- నర్సింగ్ కళాశాల భవనంలోనే తరగతులు
- వసతి గృహాలు లేక విద్యార్థుల ఇక్కట్లు
- అడ్రస్ లేని ఎక్స్‌టర్నల్ ఎగ్జామినర్ల అతిథి గృహం, క్రీడా మైదానం
- ప్రాక్టికల్స్‌కు వెళ్లేందుకు రవాణా సౌకర్యం కరువు

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, ఆగస్టు 25: కొత్తగూడెంలో ప్రభుత్వ మెడికల్ కళాశాల ఏర్పాటు చేసి సుమారు రెండేళ్లు కావస్తుంది. రాష్ట్రంలోనే విస్తీర్ణంలో అతి పెద్ద జిల్లాగా పేరుగడించిన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రమైన కొత్తగూడెంలో కాళోజీ నారాయణరావు యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్-వరంగల్ (కెఎన్ఆర్) పరిధిలో డైరెక్టరేట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ) అనుమతితో తెలంగాణ రాష్ట్రం ఆధ్వర్యంలో 2022 నవంబర్ 15వ తేదీన 150 వైద్య సీట్లు మంజూరు చేసి ప్రారంభించారు. 2022-2023 ఏడాదిలో కళాశాల తొలి బ్యాచ్‌కు 150 సీట్లకు గాను 149 సీట్లు భర్తీ కాగా, సెంట్రల్ పూల్ విభాగంలో ఓ విద్యార్థిని సొంత రాష్ట్రానికి వెళ్లిపోయారు. కళాశాలలో 2023-2024 రెండో బ్యాచ్ కోసం రెండు విడతలుగా ఆన్‌లైన్ కౌన్సిలింగ్ ప్రక్రియ ముగియడంతో సెంట్రల్ స్టార్ట్ పూల్ రెండు విభాగాలలో కలిపి 150 సీట్లు భర్తీ అయ్యాయి. ఈ ఏడాది 2024-2025 మూడో బ్యాచ్ వచ్చే నెల సెప్టెంబరు నెల ఆఖరుకు మూడు విడతలుగా కౌన్సిలింగ్‌ను పూర్తి చేసి, 150 సీట్లను భర్తీ చేయనున్నారు. కొత్తగూడెం మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రాజ్‌కుమార్‌తో పాటు, 101 మంది అధ్యాపకులు విద్యార్థులకు వైద్య విద్యను అందిస్తున్నారు. మరికొంతమంది అధ్యాపకులు అవసరం కాగా, ఇటీవల కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ పద్ధతిలో 19 కేటగిరిలలో 105 పోస్టులను భర్తీ చేసేందుకు ఇంటర్వ్యూలను నిర్వహించారు.


నిర్మాణ దశలో ఉన్న వసతి గృహాల నిర్మాణాలు

నర్సింగ్ కళాశాలలోనే...

కొత్తగూడెం ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలో 2022వ సంవత్సరంలో ప్రారంభమైన మెడికల్ కళాశాలకు పూర్తి స్థాయి భవనం లేకపోవడం గమనార్హం. నర్సింగ్ కళాశాల కోసం నిర్మించిన భవనంలోనే మెడికల్ కళాశాలను కొనసాగిస్తున్నారు. నర్సింగ్ కళాశాల నిర్వహించేందుకు కొత్తగూడెంలో ఓ భవనాన్ని అద్దెకు తీసుకొని కాలం వెల్లదీస్తున్నారు. మూడవ బ్యాచ్ మెడికల్ కళాశాలకు రానున్న నేపథ్యంలో విద్యార్థులకు మొదటి, రెండవ, మూడవ ఏడాది తరగతులకు కావాల్సిన యంత్రాలను, పరికరాలను అందుబాటులో ఉంచాలని విద్యార్థులు కోరుతున్నారు. ప్రాక్టికల్స్ గదులు ప్రత్యేకంగా ఏర్పాటు చేయాలని విద్యార్థులు ఇటీవల ధర్నా నిర్వహించారు. అందులో భాగంగా డైరెక్టరేట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ) కళాశాలలో అన్ని వసతులు సమకూరుస్తామని హామీ ఇవ్వడంతో వారు ధర్నాను విరమించారు. అనంతరం కళాశాల భవనం, బాలుర - బాలికల వసతి గృహాల నిర్మాణాలు, క్యాంటిన్ నిర్మాణాలు వేగం పుంజుకున్నాయి.

వసతి గృహాలు ఏవీ..?

కొత్తగూడెం మెడికల్ కళాశాలలో రెండు బ్యాచ్‌లకు కలిపి సుమారు 299 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. మరో 150 మంది విద్యార్థులు ఈ ఏడాది అడ్మిషన్లు పొందనున్నారు. అందులో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన బాలురు, బాలికలకు కళాశాలలో తరగతులు ముగిసిన తరువాత ఉండేందుకు ప్రయివేటు హాస్టల్స్‌ను ఆశ్రయించాల్సి వస్తుంది. కళాశాల ప్రాంగణంలో బాలుర, బాలికలకు వేరు వేరుగా వసతి గృహాలను నిర్మించేందుకు గత ఏడాది నిర్మాణాలకు శ్రీకారం చుట్టిన అవి పిల్లర్ల దశలోనే ఆగిపోయాయి. అదేవిధంగా కళాశాలలో విద్యార్థులకు బోర్డు తుది పరీక్షలు కొనసాగుతున్న నేపథ్యంలో ఎక్స్‌టర్నల్ ఎక్జామినర్లు విధులకు హాజరౌతున్నప్పటికి వారికి విశ్రాంతి కోసం ఆర్‌అండ్‌బీ అతిథి గృహం లేకపోవడంతో అనేక ఇబ్బందులు పడకతప్పడం లేదు. ప్రభుత్వం స్పందించి విద్యార్థులకు వసతి గృహాలను త్వరతిగతిన పూర్తి చేయాలని కోరుతున్నారు. వైద్యాధికారులకు అతిథి గృహం నిర్మించాలని కళాశాల బృందం కోరుతున్నారు. అదేవిధంగా కళాశాలలో క్రీడా మైదానాలు కరువయ్యాయి. కళాశాల చుట్టు ప్రహరీ నిర్మాణాలు లేకపోవడంతో అటవీ ప్రాంతంలోని విద్యార్థులు విద్యనభ్యసించాలన్నా సురక్షంగా లేవని ఆరోపణలు వినబడుతున్నాయి. టెండర్ ప్రక్రియ నిర్వహించి కళాశాల ఆవరణలో క్యాంటిన్‌తో పాటు, స్టేషనరీని అందుబాటులోకి తీసుకురావాలని కోరుతున్నారు.



కొత్తగూడెం ప్రభుత్వ మెడికల్ కళాశాల

ప్రాక్టికల్స్‌కు తప్పని తిప్పలు ...

కొత్తగూడెం మెడికల్ కళాశాలలో విద్యనభ్యసించే విద్యార్థులు తమ పాఠ్యాంశ తరగతులు పూర్తి అయిన అనంతరం ప్రాక్టికల్స్‌కు వెళ్లేందుకు వారు పడుతున్న అవస్థలు వర్ణాతీతం. కొత్తగూడెం సర్వజన ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రాక్టికల్స్‌కు రావాలన్న సుమారు 10 కిలో మీటర్లు ప్రయివేటు వాహనాల్లోనే రాకపోకలు సాగించాల్సిన దుస్థితి నెలకొంది.

రవాణా సౌకర్యాలు సరిగా లేకపోవడం తో కాలినడకనే ప్రయివేటు వాహనాలు ఎక్కే పరిస్థితి ఏర్పడిందని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం స్పందించి కళాశాలకు ప్రత్యేక బస్సులను, సౌకర్యాలను ఏర్పాటు చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

అవినీతి, కుంభకోణాలను ఎండగట్టాలి

- బీజేపీ జాతీయ నాయకుడు పొంగులేటి సుధాకర్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న పొంగులేటి సుధాకర్‌రెడ్డి

లక్ష్మీదేవిపల్లి, ఆగస్టు25: అవినీతి, కుంభకోణాల చరిత్ర కలిగిన కాంగ్రెస్ పార్టీ విధానాలను ప్రజల్లో ఎండగట్టి జిల్లాలో అత్యధిక బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టాలని బీజేపీ జాతీయ నాయకుడు, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల పొలిటికల్ ఇంచార్జీ పొంగులేటి సుధాకర్‌రెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఆదివారం కొత్తగూడెంలోని బీజేపీ జిల్లాకార్యాలయంలో ఆపార్టీ సభ్యత్వ నమోదు సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రధాని నరేంద్రమోదీ అధికారం చేపట్టిన నాటి నుంచి భారతదేశాన్ని అనేక రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళుతున్నారని గుర్తు చేశారు. పేద, మధ్యతరగతి వర్గాల వారికి అనేక సంక్షేమ పథకాలు చేపట్టారని, తెలంగాణ రాష్ట్రానికి రూ.10లక్షల కోట్లకు పైగా నిధులు అందించి రాష్ట్రాభివృద్ధికి సహకారం అందించారన్నారు. సింగరేణిలో జరిగిన కుంభకోణాలపై కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి సెంట్రల్ విజిలెన్స్ కమిటీ దృష్టికి తీసుకెళ్లినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా దళిత మోర్చా మాజీ రాష్ట్ర అధ్యక్షుడు కొప్పు బాషా మాట్లాడుతూ సెప్టెంబర్ 1న దేశవ్యాప్తంగా బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రామాన్ని ప్రధాని నరేంద్రమోదీ ప్రారంభిస్తారని పేర్కొన్నారు. జిల్లా కేంద్రాల్లో సెప్టెంబర్4న, మండల కేంద్రాల్లో సెప్టెంబర్ 5న సభ్యత్వ నమోదు కార్యక్రమాలు ప్రారంభమవుతాయని తెలిపారు. ఈసభ్యత్వ నమోదును జిల్లా వ్యాప్తంగా విజయవంతం చేయాలని అందుకు సంబంధించిన విధివిధానాలను తెలిపారు. ఈ సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు కేవీ.రంగాకిరణ్, జిల్లా ప్రధాన కార్యదర్శి టి.ఐలయ్య, రాష్ట్ర, పొనిశెట్టి వెంకటేశ్వర్లు, కుంజాదర్మ, పైడిపాటి రవీందర్, ముసలయ్య, మహబుబాద్ పార్లమెంట్ కన్వీనర్ ముస్కు శ్రీనివాస్‌రెడ్డి, మహిళా మోర్చా రాష్ట్ర కార్యదర్శి బానోతు విజయలక్ష్మి, తాటిపాముల ఐలయ్య, పొడియం బాలరాజు, గుడుగు శ్రీధర్, బలగాని గోపికృష్ణ, భిక్షపతి, త్రినాథరావు, నరేంద్రబాబు, పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరి దుర్మరణం

అశ్వాపురం, ఆగస్టు25: రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందగా, మరొక వ్యక్తికి తీవ్ర గాయాలైన సంఘటన మండల పరిధిలోని సీతారంపురం గ్రామ సమీపంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..

మండల పరిధిలోని కట్టంవారిగూడెం గ్రామానికి చెందిన కుర్సం సురేందర్(19) తన మిత్రుడు వంశీతో కలసి బైక్‌పై ఆనందాపురం నుంచి కట్టంవారిగూడెం వెళ్తుండగా మార్గమధ్యలో సీతారాంపురం వద్ద ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి, బైక్ అదుపుతప్పి రహదారిపై ఆగిఉన్న ట్రాలీ ఆటోను ఢీకొట్టడంతో ఇరువురు గాయపడ్డారు. స్థానికు లు వారిని చికిత్స నిమిత్తం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించగా, సురేందర్ అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు అశ్వాపురం ఎస్ఐ తిరుపతిరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


శివయ్య(ఫైల్)

కల్లూరు, ఆగస్టు25: రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు అక్కడిక్కడే మృతి చెందాడు. ఈ ఘటన కల్లూరులో ఆదివారం తెల్లవారు జామున జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గోపాలకుంట కాలనీకి చెందిన గోకరి శివయ్య (23) ఖమ్మంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో పెద్దనాన్న పత్తి వెంకన్న ఆనారోగ్యంతో వైద్య చికిత్స పొందుతున్నాడు. ఆదివారం అతడిని పరామర్శించి, ద్విచక్రవాహనంపై ఇంటికి వస్తుండగా, సత్తుపల్లి వైపు నుంచి కొబ్బరి బోండాలతో వస్తున్న బొలెరో వాహనం ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహన్ని పెనుబల్లి ఏరియా ఆసుపత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్ఐ షాకీర్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మనస్తాపంతో వివాహిత ఆత్మహత్య

బూర్గంపాడు, ఆగస్టు 25: మనస్తాపంతో వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటన శనివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...బూర్గంపాడు మండల పరిధిలోని లక్ష్మీపురం గ్రామానికి చెందిన మేడగం మల్లీశ్వరి(40) భర్త రామిరెడ్డి రెండెళ్ల క్రితం అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందాడు. వీరికి ఇరువురు కుమార్తెలు ఉన్నారు. పెద్ద కుమార్తెకు వివాహం కాగా, చిన్న కుమార్తె హైదారాబాద్‌లో చదువుకుంటుంది. భర్త మరణంతో మృతురాలు స్వగ్రామం మోరంపల్లిబంజరలో పుట్టింట్లో ఉంటుంది. భర్త మరణంతో మనస్తాపంతో శనివారం పుట్టింట్లో క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. గమనించిన కుటుంబసభ్యులు ఆసుపత్రికి తరలించగా, పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. ఆదివారం మృతురాలు కుమార్తె పవిత్ర ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్థిక ఇబ్బందులు తాళలేక వ్యక్తి ...

పాల్వంచ, ఆగస్టు 25 : ఆర్థిక ఇబ్బందులు తాళలేక వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటనపై పాల్వంచ టౌన్ పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణ పరిధిలోని వెంగళరావు కాలనీకి చెందిన లంజపల్లి రామకృష్ణ(36) స్థానికంగా చెప్పులు కుట్టుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అతనికి వచ్చే ఆదాయంతో కుటుంబాన్ని పోషించడం భారంగా మారడంతో ఈ మధ్య కాలంలో మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలోనే మద్యం మత్తులో శనివారం అర్ధరాత్రి ఇంట్లో కూరగాయలు తరిగే కత్తితో ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. రక్తపు మడుగులో పడి ఉన్న అతడిని భార్య, ఇతర కుటుంబ సభ్యులు పాల్వంచ ప్రభుత్వ ఆసుపత్రికి, అనంతరం మెరుగైన వైద్యం కోసం ఖమ్మం ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ రామకృష్ణ ఆదివారం మృతి చెందాడు. తన కుమారుడి మరణంపై ఎలాంటి అనుమానాలు లేవని, మృతుడి తండ్రి నాగభూషణం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ ఎస్ఐ సుమన్ తెలిపారు.

సబ్జెక్టుల్లో ఫెయిలైందని.. విద్యార్థిని ఆత్మహత్యాయత్నం

- ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి ● ఖమ్మంలో ఘటన

ఖమ్మంక్రైం, ఆగస్టు25: డిగ్రీ ఫైనలియర్ చదువుతున్న ఓ విద్యార్థిని సెమిస్టర్ ఫలితాల్లో రెండు సబ్జెక్టులు ఫెయిల్‌కావడంతో మనస్తాపంతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన నగరంలో చోటు చేసుకుంది. వన్‌టౌన్ పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలోని పెంటగడ్డ బజార్‌కు చెందిన గుబ్బల మౌనికశ్రీ(20) నగరంలోని ఓ ప్రైవేట్ కళాశాలలో డిగ్రీ ఫైనలియర్ చదువుతోంది. ఇటీవల వచ్చిన డిగ్రీ సెమిస్టర్ ఫలితాలలో రెండు సబ్జెక్టులు ఫెయిలైంది. దీంతో మనస్తాపంతో సదరు విద్యార్థిని ఈనెల 16న క్రిమిసంహారక తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గుర్తించిన కుటుంబసభ్యులు నగరంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా, మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ తరలించాలని వైద్యులు సూచించారు. దీంతో కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లోని ఓ ఆసుపత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందింది. ఈఘటనపై కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో కానిస్టేబుల్‌కు గాయాలు

పాల్వంచ, ఆగస్టు 25: ఒక్కసారిగా రోడ్డుపై ఆగిన లారీని వెనుక నుంచి కారు ఢీకొట్టడంతో జరిగిన ప్రమాదంపై పాల్వంచ టౌన్ పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తగూడెం క్లూస్‌టీంలో విధులు నిర్వహిస్తున్న శీలం నాగరమణారెడ్డి పాల్వంచ వెంకటేశ్వరహిల్స్ కాలనీలో నివాసముంటున్నాడు. శనివారం సాయంత్రం విధులు పూర్తి చేసుకొని, పాల్వంచకు తన కారులో తిరుగుప్రయాణమయ్యాడు. నవభారత్ ప్రాంతంలో కారుకు ముందుగా వెళుతున్న లారీ ఒక్కసారిగా రోడ్డుపై ఆగడంతో కారు అదుపుతప్పి లారీని ఢీ కొట్టింది. దీంతో కారులో ప్రయాణిస్తున్న అతడికి తీవ్ర గాయాలయ్యాయి. అక్కడే ఉన్న కానిస్టేబుల్ రవి అతడిని వెంటనే కొత్తగూడెం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి, కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. కాని స్టేబుల్ తండ్రి వెంకటేశ్వర్లు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్ రామన్‌సుధపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ ఎస్ఐ సుమన్ తెలిపారు.

చెర్వు మాధారంలో వ్యక్తికి గాయాలు

నేలకొండపల్లి, ఆగస్టు25: రోడ్డు ప్రమాదంలంలో వ్యక్తికి తీవ్ర గాయాలైన సంఘటన మండల పరిధిలోని చెరువుమాదారంలో ఆదివారం చోటు చేసుకుంది. చెరువు మాదారానికి చెందిన పగిడిపత్తి వీరబాబు తన ద్విచక్రవాహనంపై పొలానికి వెళ్లి తిరిగి ఇంటికి వెళుతుండగా చెరువు కట్ట దిగుతున్న సమయంలో చెరువుకట్టపైకి వెళుతున్న ఆటో ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన అతడిని స్థానికులు స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం ఖమ్మం తరలించారు.

క్రీడాకారుల్లో నైపుణ్యాలను వెలికితీయాలి: పీవో


పోటీలను ప్రారంబిస్తున్న ఐటీడీఏ పీవో రాహుల్

పాల్వంచ, ఆగస్టు 25: యువ క్రీడాకారుల్లోని ప్రతిభ, నైపుణ్యాలను వెలికితీయాలని ఐటీడీఏ పీవో రాహుల్ అన్నారు. ఆదివారం పాల్వంచ మినీ స్టేడియంలో యువజన క్రీడలశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అథ్లెటిక్స్, ఆర్చరీ పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలలో ఉత్సాహం కనబరిచే వారిని ప్రోత్సహించి, జాతీయ స్థాయి క్రీడా పోటీల్లో పాల్గొని పతకాలు సాధించే విధంగా వారికి తోడ్పాటునందించాలనే దృక్పథంతోనే ఈ క్రీడలు నిర్వహించడం జరుగుతుందని అన్నారు. ఈ నెల 29న ఒలంపిక్ హాకీ క్రీడాకారుడు మేజర్ ధ్యాన్‌చంద్ జన్మదినాన్ని పురస్కరించుకుని ఈ క్రీడా పోటీలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. యువకులు ధ్యాన్‌చంద్‌ను స్ఫూర్తిగా తీసుకుని క్రీడల్లో రాణించాలన్నారు. ప్రతిరోజూ చదువుతో పాటు, ఆసక్తి ఉన్న క్రీడలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. విద్యార్థులు, యువకులు అనుకున్న లక్ష్యాన్ని చేరుకునే వరకు విశ్రమించకూడదని హితవు పలికారు. ఆర్చరీ, అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొంటున్న క్రీడాకారులను పరిచయం చేసుకుని వారికి సలహాలు, సూచనలందించారు. జిల్లాలోని యువ క్రీడాకారులను గుర్తించి అథ్లెటిక్స్‌లో 50 మంది, ఆర్చరీలో 40 మంది క్రీడాకారులకు ఈ పోటీలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. పోటీల్లో గెలుపొందినవారికి ఈ నెల 29న జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు, బహుమతులు అందజేయడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్చరీ కోచ్ కళ్యాణ్, అథ్లెటిక్స్ కోచ్ నాగేందర్, హాకీ కోచ్ ఇమామ్, టెన్నీస్ అసోసియేషన్ సెక్రెటరీ యుగంధర్‌రెడ్డి, హాకీ అసోసియేషన్ సెక్రటరీ ప్రేమ్‌కుమార్, జిల్లాలోని క్రీడాకారులు పాల్గొన్నారు.

డ్రైవర్లను విధుల నుంచి తొలిగించడం సరైందికాదు

- ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి అప్పారావు

ఖమ్మంఖానాపురంహవేలి, ఆగస్టు25: ఖమ్మం రీజియన్ పరిధిలో ఆర్టీసీ డ్రైవర్లను బ్రీత్ ఎనలైజర్‌తో విధుల నుంచి తొలిగించడం సరైందికాదని ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి పాటి అప్పారావు అన్నారు. ఆదివారం నగరంలోని గిరిప్రసాద్ భవన్ నందు టీజీఎస్ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ ఖమ్మం రీజియన్ కార్యవర్గ సమవేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రీత్ ఎనలైజర్ సాంకేతిక లోపాల వలన, సరైన విధానంలో ఉపయోగించే విధానాలు తెలియకపోవడంతో తప్పుడు రిపోర్టులు వస్తున్నాయని తెలిపారు. వీటిని సరైన క్రమంలో ఉపయోగించి, డ్రైవర్లకు న్యాయం చేయాలని కోరారు. ఈకార్యక్రమంలో ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు రమేష్‌బాబు, నజీర్, అరుణకుమారి, రామారావు, భాస్కరరావు పాల్గొన్నారు.

వెల్ఫేర్ బోర్డు నిధులను మళ్లిస్తే ఊరుకోం

- బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు



రాస్తారోకో చేస్తున్న భవన నిర్మాణ కార్మికులు

ఖమ్మంటౌన్, ఆగస్టు 25: భవన నిర్మాణ కార్మికుల వెల్ఫేర్‌బోర్డు నిధులను ఎల్ఐసీకి ఇవ్వాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ ఆదివారం నగరంలోని జూబ్లీ క్లబ్ సెంటర్‌లో సీఐటీయూ ఆధ్వర్యంలో భవన నిర్మాణ కార్మికులు రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా ప్రధాన కార్యదర్శి ముదాం శ్రీనివాసరావు మాట్లాడుతూ రూ.3600 కోట్లు ఉన్న కార్మికుల వెల్ఫేర్ బోర్డు నిధులను భవన నిర్మాణ కార్మికులకు దక్కకుండా ఎల్ఐసీకి ఇవ్వాలని తీసుకున్న నిర్ణయాన్ని ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఉద్యమాన్ని ఉధ్రుతం చేస్తామన్నారు. ఇప్పటికే అనేక రకాలుగా నిర్మాణ కార్మికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వం వెంటనే పాత పద్ధతిలో క్లెయిమ్‌లకు అవకాశం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షుడు డోనోజు లక్ష్మయ్య, నాయకులు అమరబోయిన లింగయ్య, ఎర్ర మల్లిఖార్జున్, టీవీ. రమణ, మేడికొండ నాగేశ్వరరావు, బెల్లంకొండ లింగయ్య, పోతం సీతారాములు, మార్బుల్ సంఘం అధ్యక్షుడు రెంటపల్లి మోతీరయ్య, నాగుల్‌మీరా, మౌలానా తదితరులు పాల్గొన్నారు.

బండ్లపై కొండలు

- ఇష్టానుసారంగా బండరాళ్ల తరలింపు
- ధ్వంసమవుతున్న రహదారులు
- పట్టించుకోని అధికారులు


ఎలాంటి జాగ్రత్తలు తీసుకోకుండా లారీ, ట్రాక్టర్లపై గ్రానైట్ రాళ్లను తరలిస్తున్న దృశ్యం

ముదిగొండ, ఆగస్టు 25: టన్నుల కొద్దీ బరువు... త్రిశంకు స్వర్గంలో వేలాడుతున్న బండరాళ్లు... ఎలాంటి భద్రతా చర్యలు తీసుకోని ఆ వాహనాలు యమదూతల్లా దారి మధ్యలో దూసుకొస్తుంటే వాటి ముందు, వెనుక ఉన్న ప్రయాణికులు బిక్కుబిక్కుమంటూ ప్రయాణం చేయాల్సిన దుస్థితి నెలకొంది. లారీపై నుంచి రాళ్లు తమ మీద పడతాయోనని ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని ప్రయాణించాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. నిబంధనలకు విరుద్ధంగా అధిక బరువుతో గ్రానైట్ రాళ్లను రవాణా చేస్తున్న లారీలు, ట్రాక్టర్లు పలుమార్లు ప్రమాదాలకు కారణమవుతున్నాయి. కళ్లముందే అజాగ్రత్తగా, ప్రమాదకరంగా రాళ్లను తరలిస్తున్నా, సంబంధిత రవాణా, పోలీసు, మైనింగ్‌శాఖ అధికారులు ఏమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు.

ముదిగొండ మడలంలోని పలు గ్రానైట్ క్వారీలతోపాటు ఖమ్మం-కోదాడ ప్రధాన రహదారిలోని గ్రానైట్ క్వారీల నుంచి రాళ్లను వెలికితీసి తోలిస్తున్నారు. ముదిగొండ మీదుగా ఖమ్మం గ్రామీణ మండలాల్లో గ్రానైట్ ఫ్యాక్టరీలతోపాటు పలు ప్రాంతాలకు లారీల్లో రాళ్లు తరలుతున్నాయి. రాళ్ల తరలింపు సమయంలో చాలామంది గ్రానైట్ క్వారీల యజమానులు నిబంధనలు పాటించడం లేదనే విమర్శలు విన్పిస్తున్నాయి. లారీపై రాళ్లు తరలిస్తున్న సమయంలో పలుమార్లు ముదిగొండ పారిశ్రామిక ప్రాంతంలో పడి ప్రమాదాలు కూడా జరిగాయి. అధిక లోడుతో నిత్యం ఈ రహదారిపై రవాణా చేపట్టడంతో రహదారి మొత్తం గుంతలమయంగా మారి అధ్వానంగా తయారైంది. దీని వల్ల ముదిగొండ ప్రజలకు నరకప్రాయంగా మారింది. అధికారులు మాత్రం వాటిమీద ఎలాంటి చర్యలు తీసుకున్న పాపానపోలేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. లారీలో నుంచి రాళ్లు కిందపడకుండా పెన్సింగ్ తీగలతో కట్టాలి, కానీ అలాంటి జాగ్రత్తలు ఏమీ తీసుకోకుండానే గ్రానైట్ రాళ్లను తరలిస్తున్నారు. పగలు, రాత్రీ అనే తేడా లేకుండా జనసంచారం ఎక్కువగా ఉండే ఖమ్మం-కోదాడ ప్రధాన రహదారిపై ప్రధాన కూడళ్లు, రద్దీగా ఉండే ప్రదేశాల్లో భారీ వాహనాల్లో ఈ రాళ్లను తరలిస్తున్నారు. అధికారుల పర్యవేక్షణ, తనిఖీలు లేకపోవడంతో కొందరు వ్యాపారులు ఇష్టానుసారంగా రవాణా చేస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి తనిఖీలు చేసి, ఇలా నిబంధనలకు విరుద్ధంగా భారీ వాహనాల్లో రాళ్లను తరలిస్తున్న వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

తిరుమలాయపాలెంలో చోరీ

తిరుమలాయపాలెం, ఆగస్టు25: తిరుమలాయపాలెం గ్రామంలో శనివారం గుర్తు తెలియని వ్యక్తులు ఓ ఇంటిలో చొరబడి రూ.1.80లక్షల నగదు, రెండు తులాల బంగారం, 20 తులాల వెండి ఎత్తుకెళ్లారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన జక్కుల భద్రమ్మ ఖమ్మంలోని ప్రైవేటు ఆసుపత్రిలో స్వీపర్‌గా పనిచేస్తుంది. శనివారం ఉదయం పనికి వెళ్లి రాత్రి 9గంటల సమయంలో వచ్చి చూడగా బీరువా పగులగొట్టి ఉండడాన్ని గమనించి, పరిశీలించగా దానిలో రూ.1.80లక్షల నగదు, రెండు తులాల బంగారం, 20తులాల వెండి పట్టీలను ఎత్తుకెళ్లారు. దొంగలు ఇంటి ముందున్న కిటీకిని పగులగొట్టి చోరీకి పాల్పడ్డారు. సంఘటనా స్థలాన్ని ఎస్ఐ జగదీష్ పరిశీలించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

శానిటరీ ఇన్‌స్పెక్టర్‌కు బెదిరింపులు!

ఖమ్మం సంక్షేమ విభాగం, ఆగస్టు 25: ఇతర జిల్లా నుంచి వచ్చిన శానిటరీ ఇన్‌స్పెక్టర్ బాధ్యతలు స్వీకరించిన కొన్ని రోజులకే ఓ కార్పొరేటర్ భర్త నుంచి బెదిరింపులు రావడంతో అవాక్కయ్యారు. ఖమ్మంనగర పాలక సంస్థ పరిధిలోని రేవతి సెంటర్‌లో పారిశుధ్య పనులకు కేటాయించిబడి బయో మెట్రిక్ నమోదు ఉన్న కార్మికులను, పక్క డివిజన్‌లో పనులు చేసేందుకు పక్క డివిజన్ కార్పొరేటర్ భర్త కోరారు. అయితే నూతనంగా బాధ్యతలు స్వీకరించిన శానిటరీ ఇన్‌స్పెక్టర్ అందుకు ఒప్పుకోలేదు. నిబంధనల మేరకు ఏ డివిజన్‌లో బయోమెట్రిక్ వేసిన కార్మికులు ఆదే డివిజన్‌లో పనులు చేయా ల్సి ఉంటుందని అంగీకరించలేదు. దీంతో కార్పొరేటర్ భర్త సీరియస్‌గా తీసుకొని ఆ శానిటరీ ఇన్‌స్పెక్టర్‌కు ఫోన్లు చేసి బెదిరించారని కేఎంసీలోని పారిశుధ్య ఉద్యోగుల మధ్య చర్చ జరిగింది. కార్పొరేటర్ భర్త తమ డివిజన్‌లో పారిశుధ్య వాహనాలు ఉంచడంతో ప్రజలు అసౌకర్యానికి గురవుతున్నారని, కేఎంసీకి చెందిన పారిశుధ్య ట్రాక్టర్‌లను వెంటనే డివిజన్ నుంచి బయటకు పంపాలని మరీ అధికారులకు లేఖ పంపారు. ఈ విషయం నగర పాలక సంస్థ పాలకవర్గానికి కూడా చేరింది. మరో కార్పొరేటర్ సైతం పారిశుధ్య కార్మికులతో ఇంటిలో పనులు చేయించుకోవటానికి వినియోగించుకుంటున్నారనే చర్చ జరుగుతుంది.

కేఎంసీ మాజీ ఎస్ఈ డెంగ్యూతో మృతి


అంజనేయప్రసాద్

ఖమ్మం సంక్షేమ విభాగం, ఆగస్టు 25: ఖమ్మం నగర పాలక సంస్థ కార్యాలయం మాజీ ఎస్ఈ అంజనేయప్రసాద్(56) ఆదివారం మృతి చెందారు. కాగా గత కొద్ది రోజులుగా డెంగ్యూతో బాధపడుతున్న ఆయన హైదరాబాద్‌లోని తన నివాసంలో మృతి చెందారు. ఆయన మృతి పట్ల ఖమ్మం నగర పాలక సంస్థ కార్యాలయంలోని అధికారులు, ఉద్యోగులు సంతాపం తెలిపారు.

అనారోగ్యంతో పటేల్ వసంతరావు...

సత్తుపల్లి, ఆగస్టు 25: సీనియర్ నాయకుడు నరుకుళ్ల వసంతరావు అలియాస్ పటేల్ (78) అనారోగ్యంతో ఆదివారం మృతి చెందారు. ఆయన మృతదేహాన్ని మునిసిపల్ చైర్‌పర్సన్ కూసంపూడి మహేష్, కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ సందర్శించి నివాళులర్పించారు. పటేల్ కుటుంబ సభ్యులకు రాష్ట్ర వ్యవసాయ శాఖమంత్రి తుమ్మల నాగేశ్వరరావు, టీజీఐడీసీ చైర్మన్ మువ్వా విజయబాబు, మాజీమంత్రి సంబాని చంద్రశేఖర్, మాజీ ఎంపీ నామా నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య, మాజీ ఎమ్మెల్యే జలగం వెంకటరావులు ఆయన కుటుంబానికి సంతాపం తెలిపారు. కాగా వసంతరావు 1970నుంచి 1986వరకు పోలీస్ పటేల్‌గా పనిచేశారు. అయా పార్టీలలో క్రియాశీలకంగా వ్యవహరించారు.

మాజీ వార్డు సభ్యురాలు అనసూర్య..


అనసూర్య

జూలూరుపాడు, ఆగస్టు25: మండలంలోని వెంగన్నపాలెం గ్రామానికి చెందిన మాజీ వార్డు సభ్యురాలు దరావత్ అనసూర్య (62) అనారోగ్యంతో ఆదివారం మృతి చెందారు. ఆమెకు గత కొన్ని రోజుల క్రితం గుండె పోటు రావడంతో హైదారాబాద్‌లోని ఆసుపత్రిలో బైపాస్ సర్జరీ చేయించుకొని చికిత్స పొందుతుంది. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందింది. ఆమె మృతి పట్ల పలువురు నాయకులు సంతాపం తెలిపారు.

సమాజంలో అశాస్త్రీయ భావాలను తొలిగించాలి

- జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షుడు కోయ వెంకటేశ్వరారవు



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్వరరావు

ఖమ్మంఖానాపురంహవేలి, ఆగస్టు25: సమాజంలో పేరుకుపోయిన అశాస్త్రీయ భావాలను తొలిగించేందుకు శాస్త్రీయ దృక్పథాన్ని పెంచేందుకు జనవిజ్ఞాన వేదిక కృషి చేస్తుందని ఆ సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు కోయ వెంకటేశ్వరావు, కోశాధికారి వరప్రసాద్‌లు అన్నారు. ఆదివారం నగరంలోని కవితా మెమోరియల్ డిగ్రీ కళాశాలలో జనవిజ్ఞాన వేదిక తెలంగాణ 5వ మహాసభలు నిర్వహించారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా వి.మోహన్, ప్రధాన కార్యదర్శిగా రామారావు, కోశాధికారిగా టి.శివన్నారాయణలను ఎన్నుకున్నారు.

ఇల్లెందు పీఏసీఎస్ సెక్రటరీ అరెస్ట్

ఇల్లెందు టౌన్, ఆగస్టు 25: ఇల్లెందు సహకార వ్యవసాయ పరపతి సంఘం సెక్రటరీ హరి ప్రసాద్‌ను ఆదివారం కొమరారం పోలీసులు అరెస్ట్ చేశారు. ఇల్లెందు పీఏసీఎస్‌లో సుమారు 70 యూరియా కట్టలు అక్రమంగా ఓ వ్యాపారికి తరలించ డంపై పోలీసులు కేసు నమోదు చేసిన విషయం విధితమే. కాగా అతడిని పోలీసు లు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసులో నిందితుడిగా ఉన్న హరి ప్రసాద్‌ను అధికారులు సస్పెండ్ చేయగా, పోలీసులు అరెస్టు చేయడం గమనార్హం.

నగరంలో మార్బుల్ మేస్త్రీల సమ్మె విరమణ

ఖమ్మంటౌన్, ఆగస్టు 25: రేట్లు పెంచాలనే డిమాండ్‌తో ఈనెల 15 నుంచి సమ్మె నిర్వహిస్తున్న మార్బుల్ మేస్త్రీలు సమ్మె విరమిస్తున్నట్లు తెలిపారు. బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో ఆదివారం మార్బుల్ వర్కర్స్ నగర ప్రధాన కార్యదర్శి ఎస్కే. గోరేమియా అధ్యక్షతన నగరంలోని మేస్త్రీలతో సమావేశం నిర్వహించారు. సోమవారం నుంచి విధులకు హాజరుకావాలని నిర్ణయించారు. ఈ సమావేశంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు మార్బుల్ వర్కర్స్ యూనియన్ గౌరవ సలహాదారులు ఎస్కే. జానీమియా, బండి పుల్లయ్య, వాజిద్, కోశాధికారి మౌలానా, ఉపాధ్యక్షుడు గౌస్, ప్రచార కార్యదర్శి జానీమియా పాల్గొన్నారు.

ఆర్యవైశ్య సంఘం ఎన్నికలకు నామినేషన్ల దాఖలు

వైరా, ఆగస్టు 25: వైరా మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్ష ఎన్నికలకు ఆదివారం నామినేషన్లు దాఖలు ప్రారంభం, ముగింపు ప్రక్రియ ముగిసింది. ఈ అధ్యక్ష ఎన్నికల కోసం మిట్టపల్లి రాఘవరావు, మిట్టపల్లి కిరణ్ నామినేషన్లు దాఖలు చేశారు. ఆ వెంటనే నామినేషన్ల పరిశీలన జరిపి వాటిని ఆమోదించారు. వచ్చేనెల ఒకటిన జరుగనున్న అధ్యక్ష పదవి కోసం కిరణ్, రాఘవరావు పోటీపడుతున్నారు. ఎన్నికల అధికారులుగా చారుగుండ్ల వెంకటలక్ష్మీనర్సింహారావు, మహంకాళి వెంకట శ్రీనివాసరావు, వంగవేటి రాజశేఖర్, ఎన్నికల పర్యవేక్షకులుగా వనమా విశ్వేశ్వరరావు, నూకల శ్రీనివాసరావు, వనమా కిరణ్‌కుమార్ వ్యవహరిస్తున్నారు.


నామినేషన్ దాఖలు చేస్తున్న కిరణ్

ఘనంగా బోనాల సందడి..



ఖమ్మంలో బోనాలతో శివసత్తులు


బోనాలతో యువతులు

ఖమ్మంఖానాపురంహవేలి, ఆగస్టు 25: శ్రావణమాసం మూడో ఆదివారం సందర్భంగా జిల్లాలోని పలు ప్రాంతాలలో బోనాలు ఘనంగా నిర్వహించారు. మహిళలు ముత్యాలమ్మ, మైసమ్మ ఆలయాలవద్ద బోనాలతో, డప్పు, మంగళ వాయిద్యాలతో మొక్కులు చెల్లించుకున్నారు. మహిళలు బోనాలతో అమ్మవార్ల ఆలయాలు చుట్టూ ప్రదక్షిణలునిర్వహించి బోనాలు సమర్పించి దీవెనలుపొందారు. పోతురాజుకు బలిప్రసాదాన్ని సమర్పించారు.

●ముదిగొండ: ముదిగొండ మండలంలోని అన్ని గ్రామాల్లో ఆదివారం ముత్యాలమ్మ బోనాల వేడుకలు ఘనంగా నిర్వహించారు.

●తల్లాడ: తల్లాడ మండలంలో ఆదివారం ముత్యాలమ్మ వేడుకలు ఘనంగా జరిగాయి. మండలంలోని రామానుజవరం, మిట్టపల్లి, రామచంద్రాపురం, కుర్నవల్లి తదితర గ్రామాల్లో వేడుకలు నిర్వహించారు. ప్రభబండ్లతో ప్రదర్శన నిర్వహించారు. మహిళలు బోనాలతో బొడ్రాయి, ముత్యాలమ్మకు మొక్కులు చెల్లించారు.

●చింతకాని: మండల పరిధిలోని పలు గ్రామాల్లో ముత్యాలమ్మ బోనాల వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమాల్లో గ్రామ పెద్దలు,మహిళలు,భక్తులు పాల్గొన్నారు.

●ఎర్రుపాలెం: జమలాపురం గ్రామంలో శ్రావణమాసంలో ముత్యాలమ్మ గ్రామ దేవతకు వార్షిక బోనాలను గ్రామస్తులను ఆదివారం సమర్పించారు.




తల్లాడలో ప్రభ బండ్లతో ప్రదర్శన, ముదిగొండలో బోనాలతో వస్తున్న మహిళలు, ఎర్రుపాలెంలో పూజలు

ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్

- 60 డివిజన్లలో కేఎంసీ, మెప్మా, వైద్య బృందాలు పారిశుధ్య పనులు

ఖమ్మం సంక్షేమ విభాగం, ఆగస్టు 25: ఖమ్మం నగరంలో వరసగా సీజనల్, డెంగ్యూ జ్వరాలు నమోదు కావటంతో కమిషనర్ అభిషేక్ అగస్త్య ఆదేశాల మేరకు ఆదివారం పారిశుధ్య ప్రత్యేక డ్రైవ్ చేపట్టారు. నగరంలోని 60 డివిజన్లలో పారిశుధ్య కార్మికులు, మెప్మా ఆర్పీలు, ఆశ కార్యకర్తలు ఇంటింటి పారిశుధ్య పరిశీలన కార్యక్రమాలు చేపట్టారు. డెంగ్యూ వ్యాధికి కారణమైన మంచినీటి నిల్వలో లార్వలను ఇళ్లలో ప్రజలకు చూపించి అవగాహన కల్పించారు.

ఖమ్మం నగరంలో డెంగ్యూ కేసులు పెరుగుతున్న దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, రోజు విడిచి రోజు మంచినీళ్లను మార్చుకోవాలని సీజనల్ వ్యాధులకు గురి కావొద్దని, నగర కమిషనర్ అభిషేక్ అగస్త్య ఓ ప్రకటనలో కోరారు. నీటి తొట్టెలు, బిందెలు, బకెట్లలో నీటిని మార్చుకోవాలని సూచించారు. ఇంటి పరిసరాలు, డాపాలపై నీటి నిల్వలు ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. పాత ఇనుము సామాన్లు, టైర్ల ద్వారా దోమల వ్యాప్తి చెందుతాయని కమిషనర్ అభిషేక్ అగస్త్య సూచించారు.


వసతిగృహాల చుట్టూ డోజర్‌తో శుభ్రం చేయిస్తున్న కేఎంసీ అధికారులు


నీటిని పరిశీలిస్తున్న కేఎంసీ అధికారులు

సంక్షేమ వసతిగృహాల చుట్టూ పారిశుధ్య కార్యక్రమాలు

ఖమ్మం నగరంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, సంక్షేమ వసతిగృహాలు, గురుకుల వసతిగృహాల చుట్టూ పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించాలని శనివారం ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో కేఎంసీ ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టటంతో కమిషనర్ ఆదేశాల మేరకు అసిస్టెంట్ కమిషనర్ సంపత్‌కుమార్ నగరంలోని ప్రభుత్వ సంక్షేమ వసతిగృహాల చుట్టూ పారిశుధ్య పనులు చేయించారు. డోజర్లతో హాస్టల్స్ చుట్టూ నిల్వ ఉన్న నీరు, పిచ్చి మొక్కలు, చెత్తను తొలగించారు. డ్రైనేజీ మరమ్మతులు చేపట్టి డ్రైనేజీ నీరు నిల్వ లేకుండా చర్యలు చేపట్టారు.

వాసవీ క్లబ్‌ల ఆధ్వర్యంలో రూ.25లక్షల సేవా కార్యక్రమాలు

● ఇంటర్ నేషనల్ వైస్ ప్రెసిడెంట్ ఇరుకుల్ల

నేలకొండపల్లి, ఆగస్టు 25: వాసవీ క్లబ్బుల ఆధ్వర్యంలో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఈ సంవత్సరం ఇప్పటి వరకు రూ.25లక్షలతో వివిధ రకాల సేవా కార్యక్రమాలను నిర్వహించినట్లు క్లబ్బుల అంతార్జాతీయ ఎగ్జిక్యూటివ్ ఉపాధ్యక్షుడు ఇరుకుల్ల రామకృష్ణ తెలిపారు. ఆదివారం నేలకొండపల్లి వాసవీభవన్‌లో జరిగిన ఉమ్మడి ఖమ్మం జిల్లా సెకండ్ క్యాబినెట్ మీటింగ్‌లో రామకృష్ణ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. జిల్లా గవర్నర్ గుమ్మడవెల్లి శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో రామకృష్ణ మాట్లాడుతూ ఈసంవత్సరం మొత్తం రెండు వేల క్లబ్బులు పని చేస్తున్నాయన్నారు. ప్రతి క్లబ్ దాని స్థాయిని బట్టి రూ.50వేల నుంచి లక్ష వరకు సేవా కార్యక్రమాలకు ఖర్చు చేసినట్లు చెప్పారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఇప్పటి వరకు రూ.25లక్షల సేవా కార్యక్రమాలను క్లబ్బులు నిర్వహించాయన్నారు. నవంబరులో వాసవీ క్లబ్స్ ఇంటర్నేషనల్స్ నుంచి ప్రతి క్లబ్ నుంచి ఒక బీద విద్యార్థికి రూ.5వేల చొప్పన ఆన్‌లైన్ బ్యాంకింగ్ ద్వారా అందచేయనున్నట్లు రామకృష్ణ చెప్పారు. కార్యక్రమంలో అంతర్జాతీయ ఉపాధ్యక్షులు గంగిశెట్టి గంగాధరరావు, రేగూరి హనుమంతరావు, క్యాబినెట్ సెక్రటరీ గోళ్ళ రాధాకృష్ణమూర్తి, కోశాధికారి గెల్లా జగన్మోహన్‌రావు, దారా మల్లికార్జునరావు, రేగూరి వాసవి, హోస్ట్ క్లబ్ సభ్యులు దోసపాటి చంద్రశేఖర్, కొత్త రమేష్, దోసపాటి వెంకటేశ్వరరావు, దోసపాటి అచ్చుతరామయ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రామకృష్ణ

బేషరతుగా రుణమాఫీ అమలు చేయాలి: ఏఐపీకేఎస్

సత్తుపల్లిరూరల్, ఆగస్టు 25: రూ.2లక్షల రైతు రుణమాఫీ బేషరతుగా అమలు చేయాలని అఖిల భారత ప్రగతిశీల రైతుసంఘం (ఏఐపీకేఎస్) డివిజన్ కార్యదర్శి ఒగ్గు నాగిరెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక నీలం రామచంద్రయ్య భవనంలో మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారంలోకి వచ్చిన వెంటనే రుణమాఫీతో పాటు రైతుభరోసా ఎకరానికి రెండు విడతలుగా రూ.15వేలు ఇస్తామని హామీ ఇవ్వగా 9నెలలు కావస్తున్నా ఇచ్చిన హామీలను వేటినీ కూడా పూర్తిస్థాయిలో అమలు చేయడం లేదన్నారు. ఇంకా అర్హులైన రైతులకు రుణమాఫీ అమలు చేయాలంటే రూ.13వేల కోట్లు అవసరం ఉందని, కేంద్ర,రాష్ట్ర పాలకులు అవలంభిస్తున్న రైతు వ్యతిరేక విధానాలపై రైతాంగం ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. ఇందుకు ఈనెల 28న ఖమ్మం కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాగప్రసాద్, భాస్కర్, విశ్వనాథం, ఆదామ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏఐపీకేఎస్ నాయకులు నాగిరెడ్డి

చెత్త పంచాయితీ..

- కేఎంసీ వర్సెస్ విద్యుత్ శాఖ
- నెల రోజులుగా తొలగించని చెత్త

ఖమ్మం సంక్షేమ విభాగం, ఆగస్టు 25: ప్రభుత్వశాఖలు సమన్వయంతో కలిసి పనిచేస్తేనే ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలతో పాటుగా ప్రజా ఆరోగ్యం కాపాడబడుతోంది. ఖమ్మంనగరంలోని ఓ కార్పొరేటర్ డివిజన్‌లో మాత్రం కేఎంసీ వర్సెస్ విద్యుత్‌శాఖ అనే రీతిలో సాగుతుండటంతో నెలల తరబడి చెత్త పెరిగి స్థానిక ప్రజలు అనారోగ్యానికి గురైతున్నారు. బుర్హాన్‌పురం సమీపంలోని మేకలసంగయ్య బజార్‌లో నెల రోజుల క్రితం విద్యుత్‌శాఖ ఉద్యోగులు చెట్లు నరికివేశారు. రోడ్డు పక్కన పడేశారు. వాటిని ఎవ్వరు తొలగించాలనే విషయంపై విద్యుత్, కేఎంసీ శాఖ మధ్య పంచాయితీ ఏర్పడి నెల రోజులుగా చెత్తను తొలగించలేదు. దీంతో ఇదే వీదిలో ఐదుగురు జ్వరాల బారిన పడ్డారు. చెత్త పంచాయితిని అధికారులే తీర్చాలని ప్రజలు కోరుతున్నారు.


మేకల సంగయ్య బజార్‌లో నెల రోజులుగా తొలగించని చెత్త

మండల్ స్ఫూర్తి బీసీల ఐక్యతకు నాంది కావాలి

ఖమ్మంచర్చికాంపౌండ్, ఆగస్టు 25: బీసీల సాధికారతకు, బీసీల రిజర్వేషన్ సాధనకు కృషిచేసిన బీపీ మండల్ స్ఫూర్తి బీసీల ఐక్యతకు నాంది పలకాలని 'వీరనారీమణుల ఆశయ సాధనసమితి' గౌరవ సలహాదారులు రిటైర్డ్ సీఐ పుల్లయ్య అన్నారు. ఆదివారం నగరంలోని సంఘం కార్యాలయంలో బీపీ మండల్ జయంతి వేడుకలు నిర్వహించారు. తొలుత మండల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగినసభలో ఆయన మాట్లాడుతూ సమాజంలో సగభాగంగా ఉన్న బీసీల సాధికారతతోనే సామాజిక సాధికారత సాధ్యమవుతుందన్నారు. బీసీలు సామాజిక సాధికారిత కోసం రాజకీయాలకతీతంగా ఉద్యమించాలన్నారు. ఈకార్యక్రమంలో లంబాడీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు బానోతు బద్రునాయక్, ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనారిటీ ప్రజాసంఘాల ఐక్యవేదిక జిల్ల కన్వీనర్ షేక్ నజీమా, మామిడాల ఝాన్సీ, జాన్‌బీ, త్రివేణి, జ్యోతి, భవాని, నాగమణి, లలిత తదితరులు పాల్గొన్నారు.


నివాళులర్పిస్తున్న ప్రజాసంఘాల నేతలు

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

ఖమ్మం రూరల్, ఆగస్టు 25: మండలంలోని ఏదులాపురం గ్రామానికి చెందిన పలువురు లబ్ధిదారులకు ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి సిఫారసుతో మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను సీపీఎం జిల్లా కమిటి సభ్యుడు ఊరడి సుదర్శన్ రెడ్డి లబ్ధిదారులకు ఆదివారం అందజేశారు. మొత్తం 5గురు లబ్ధిదారులకు సుమారు. రూ.లక్ష వరకు చెక్కులు అందజేశారు. సుదర్శన్ రెడ్డి మాట్లాడుతు ఏదులాపురం గ్రామంలో ఎమ్మెల్సీ నర్సిరెడ్డి సిఫారసుతో ఇప్పటివరకు సుమారు రూ.కోటి, ముప్పై లక్షల రూపాయల చెక్కులు చెక్కులు అందజేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు వెంకటేశ్వర్లు, నాగయ్య, బ్రహ్మం, పి.అనీష్, నరేస్, మధు రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుడు చందర్‌రావుకు పరామర్శ

కల్లూరు, ఆగస్టు 25 అనారోగ్యంతో హైదరాబాద్‌లోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సీనియర్ కాంగ్రెస్ నాయకుడు పసుమర్తి చందర్‌రావును ఆదివారం కల్లూరు కాంగ్రెస్ నాయకులు పరామర్శించారు. చికిత్స పొందుతున్న చందర్‌రావును కలుసుకుని ఆరోగ్య క్షేమ సమాచారాన్ని అడిగి తెలుసుకున్నారు. ఈ మేరకు పరామర్శించిన వారిలో కాంగ్రెస్ నాయకులు భైర్ల కాంతరావు, కుంచాల గురవయ్య, కనకపూడి జయరాజు, ఎండి అయూబ్, బొల్లెపోగు రవి, కుసూనూరు బాలనాగేశ్వరరావు, మైబు తదితరులు ఉన్నారు.


చందర్‌రావును పరామర్శిస్తున్న కల్లూరు నాయకులు

2002 బ్యాచ్ కానిస్టేబుళ్ల ఆత్మీయ సమ్మేళనం

ఖమ్మంక్రైం, ఆగస్టు 25: 2002 బ్యాచ్‌కు చెందిన 40మంది పోలీసు కానిస్టేబుళ్ల ఆదివారం నగరంలోని ఓ హోటల్‌లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. విధినిర్వహణలో ఎక్కడెక్కడో స్థిరపడిన వారంతా ఒకచోట చేరి వారి అనుభవాలు నెమరువేసుకున్నారు. 22ఏళ్ల తర్వాత కలుసుకన్న వారు ఒకరికొకరు పలకరించుకుంటూ జీవనస్థితిగతులు పంచుకుని ఆనదంగా గడిపారు.

శ్రీ లక్ష్మి తిరుపతమ్మ ఆలయానికి సీసీ కెమెరాల వితరణ

కామేపల్లి, ఆగస్టు 25: కామేపల్లి మండలం తాళ్లగూడెంలోని శ్రీ లక్ష్మితిరుపతమ్మ ఆలయానికి సీసీ కెమెరాలను వితరణ చేశారు. ఇటీవల ఆలయంలో హుండీని దొంగలు పగలుగొట్టి అందులో ఉన్న నగదును అపహరించుకొని పోయారు. సీసీ కెమెరాలను పుచ్చకాయల క్రిష్ణ, పుచ్చకాయల వెంకటేశ్వర్లు, పుచ్చకాయల చిన్న వెంకటేశ్వర్లు, పుచ్చకాయల కోటయ్య, కంపసాటి క్రిష్ణ, పుచ్చకాయల వంశీ, సఫావట్ పవన్, నవీన్ వితరణగా అందజేశారు. ఈ కార్యక్రమంలో పుచ్చకాయల వెంకటక్రిష్ణ, నర్సయ్య తదితరులు ఉన్నారు.


ఆలయానికి సీసీ కెమెరాలు అందజేస్తున్న దృశ్యం

రుణమాఫీ రాని రైతులు దరఖాస్తు చేయాలి: ఏవో

తిరుమలాయపాలెం, ఆగస్టు 25: రుణమాఫీ రాని రైతులు అధైర్యపడవద్దని ప్రతి రైతు కుటుంబానికి ప్రభుత్వం రుణమాఫీ చేసేందుక సిద్ధంగా ఉందని ఏవో నారెడ్డి సీతారామిరెడ్డి తెలిపారు. ఆదివారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ మండలంలో రూ.2లక్షల రుణమాఫీ కాని రైతులు ఎలాంటి ఆందోళనకు గురికావద్దన్నారు. రైతులు ఏవో కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. మండల వ్యసాయశాఖ కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటుచేశామని తెలిపారు. ఏదైనా సమస్య ఉంటే నేరుగా వచ్చి దరఖాస్తు చేయాలని తెలిపారు.

విద్యార్థులు నూరుశాతం ఉత్తీర్ణులయ్యేటట్టు కృషిచేస్తాం

ఖమ్మంఖానాపురంహవేలి, ఆగస్టు 25: విద్యార్థులు నూరుశాతం భాషా సబ్జెక్టులలో ఉత్తీర్ణులయ్యేటట్టు కృషిచేస్తామని భాషా పండితుల రాష్ట్ర అధ్యక్షుడు సీహెచ్ జగదీష్, ప్రధాన కార్యదర్శి నర్సింహులు అన్నారు. ఆదివారం నగరంలోని జడ్పీమీటింగ్ హాల్‌లో ఆర్‌యూటీపీటీఎస్ ఖమ్మంజిల్లా భాషాపండితుల ఆత్మీయసమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ జిల్లాలో 220మంది తెలుగు, 205మంది హిందీ పండిట్లకు ప్రమోషన్లు అందాయని అందుకు కృషి చేసిన జిల్లా , రాష్ట్ర నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈకార్యక్రమంలో సంఘం జిల్లా నాయకులు ఉమాదేవి, సుచరిత, పాల్గొన్నారు.

రేపు కలెక్టరేట్ ముట్టడిని జయప్రదం చేయండి: సీపీఐ

ఏన్కూరు ఆగస్టు 25: షరతులు లేకుండా రైతులదరికి రుణమాఫీ చేయాలని కోరుతూ రైతు సంఘం ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సీపీఐ మండల కార్యదర్శి జాగర్లముడి రంజిత్‌కుమార్ కోరారు. ఆదివారం ఏన్కూరకులో రైతుసంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో రైతుసంఘం జిల్లా సహాయ కార్యదర్శి అమరనేని వీరభద్రం, గ్రామ కార్యదర్శి వెంకన్న, రేమస్, నాగభూషణంపాల్గొన్నారు

కాంగ్రెస్‌లో అందరూ సమానమే

కారేపల్లి ఆగస్టు 25: మండలంలో కాంగ్రెస్ పార్టీలో ఒకరు, ఎక్కువ అనే భేదంలేదని అందరు సమానంగానే ఉన్నామని ఆదివారం కాంగ్రెస్ మండల నాయకులు అన్నారు. శనివారం కొందరు కాంగ్రెస్ పార్టీ నాయకులు పార్టీలో సీనియర్లను పట్టించుకోవడంలేదని ఆరోపించారు. దీనిపై స్పందించిన రాష్ట్ర మహిళ కాంగ్రెస్ నాయకురాలు పగడాల మంజుల, జిల్లా నాయకులు బాణోత్ రాంమూర్తి నాయక్, ఇమ్మడి తిరుపతిరావు మండల పరిధిలోని గేటుకారేపల్లిలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ మండలంలో అందరు సమష్టిగా పనిచేసి ఎంపీ, ఎమ్మెల్యే ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలిపించుకున్నామన్నారు. రానున్న స్థానిక ఎన్నికల్లో అన్నిస్థానాల్లో కాంగ్రెస్ పార్టీకి చెందిన అభ్యర్థులను గెలిపించుకుంటామన్నారు. అందరు ఎమ్మెల్యే రాందాస్ నాయక్ నాయకత్వంలో పనిచేయాలన్నారు. కార్యక్రమంలో అందరు సమానంగా పనిచేయాలని వారు కార్యకర్తలను, నాయకులను కోరారు. ఈ కార్యక్రమంలో దుగ్గినేని శ్రీనివాస్‌రావు, దేవ్లానాయక్, మల్లెల నాగేశ్వరరావు, నర్సింగ్‌శ్రీనివాస్, గోపాల్, కోటిఅప్పరావు, పర్స సనత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

వెంకటసాయినగర్‌లో వనభోజనాల సందడి


వనభోజనాలలో కాలనీవాసుల సందడి

కారేపల్లి ఆగస్టు 25: మండల కేంద్రంలోని వెంకటసాయి నగర్‌కు చెందిన పలు కుటుంబాలకు వారు ఆదివారం వనభోజనాలకు తరలివెళ్ళారు. శావణ మాసం సందర్భంగా కాలనికి చెందిని పలువురు మామిడితోటలోకి వెళ్లి భోజనాలు తయారుచేసుకుని కలిసి భోజనాలు చేశారు.అనంతరం ఆటపాటలతో సందడిచేశారు.ఈకార్యక్రమంలోభాస్కర్, సమ్మయ్య, పూనెం శివరాం, రామారావు, రవి, భరత్, వెంకటేశ్వర్లు, రమాదేవి, రోహిత, ఉష పాల్గొన్నారు.

బదిలీపై వెళ్తున్న ఏఈఓకు ఘన సన్మానం

కల్లూరు, ఆగస్టు 25 మండల పరిధిలో గల పెద్దకోరుకొండి గ్రామంలో ఏఈఓగా పనిచేసి బదిలిపై వెళ్లతున్నఏఈఓ కే నరేష్‌ను ఆదివారం పలువురు తాజా మాజీ ప్రజా ప్రతినిధులు, రైతులు, అఖిల పక్షరాజకీయ నాయకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఏవో ఏ రూప, బీఆర్ఎస్ కాంగ్రెస్ నాయకులు చింతల పూడి బారిష్టర్, తాళ్లూరి శ్రీనివాసరావు, జ్యేష్ట వెంకటేశ్వరరావు, మాదాల గోపాలరావు, కొడిశాన బాబురావు, మాదాల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ సీఐగా సత్యనారాయణ

ఖమ్మంక్రైం, ఆగస్టు25: ఖమ్మం ట్రాఫిక్ సీఐగా బెల్లం సత్యనారాయణ నియమితులయ్యారు. ఈమేరకు పోలీసుశాఖ నుంచి ఆదివారం ఉత్తర్వులు వెలువడ్డాయి. సీసీఎస్2బీ కొత్తగూడెంలో విధులు నిర్వహిస్తున్న ఆయన్ను ఖమ్మం ట్రాఫిక్ సీఐగా నియమించారు.

పాపన్నగౌడ్ విగ్రహావిష్కరణ


విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

పెనుబల్లి, ఆగస్టు 25: వందల ఏళ్ల క్రితం బహుజనులను కూడగట్టి అనేక యుద్ధాలు చేసి కోటలు ఏర్పాటుచేసుకొని బహుజనులకు ఆరాధ్య దైవంగా సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ నిలిచాడని పెనుబల్లి మండల గౌడసంఘం నాయకులు పేర్కొన్నారు. మండలంలోని తాళ్లపెంటలో గ్రామస్థులు ఏర్పాటుచేసిన విగ్రహాన్ని ఆదివారం వారు ఆవిష్కరించారు. కార్యక్రమంలో విగ్రహ కమిటీ బాధ్యులు పర్సా సుబ్బయ్య బండి రాఘవులు, కాటినేని శ్రీనివాస్, పానుగంటి శ్రీనివాసరావు, కాటినేని నాగేశ్వరరావు, నర్సింహారావు, పర్సా నాగేశ్వరరావు, వెంకటనారాయణ, గౌడ సంఘం నాయకులు కుక్కా శ్రీనివాసరావు, చలమాల విఠల్‌రావు, మల్లెల శ్రీనివాసరావు, వేముల సురేష్, గాయం తిరుపతిరావు, తడికమళ్ల చిరంజీవి, సూరపురెడ్డి కిరణ్‌రెడ్డి, కాటా సీతరాములు, మరకాల నర్సోత్తమరెడ్డి, తీగెల వెంకటరెడ్డి పాల్గొన్నారు.

అందరి చూపు మధిర వైపే: మల్లు నందిని

మధిరటౌన్/ వైరా/ చింతకాని, ఆగస్టు 25: మధిర నియోజకవర్గంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలతో రాష్ట్రంలో అందరి చూపు మధిర వైపే ఉందని అమ్మ ఫౌండేషన్ చైర్మన్ మల్లు నందిని అన్నారు. శనివారం రాత్రి మధిర బంజారా కాలనీలో కాంగ్రెస్ నాయకులు మల్లాది వాసు నాయకత్వంలో బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరినవారికి ఆమె కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఆమె మాట్లాడుతు మధిరలో అండర్ గ్రౌండ్ డ్రైనేజి, ఇండస్ట్రీయల్ పార్కు, మధిర చుట్టూ ఔటర్ రింగ్ రోడ్డు, బోనకల్ లో ఇందిరా డైరీ, చింతకాని, మధిర లో ఇంటర్నేషనల్ స్కూళ్లు అనేక అంతర్గత రహదారులు తో పాటు ఇంకెన్నో అబివృద్ధి కార్యక్రమాలు మంజూరు చేయించి కొన్నింటికి శంకుస్థాపనలు చేసి పనులు ప్రారంభించారన్నారు. కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ అధికార ప్రతినిధి వేమిరెడ్డి శ్రీనివాస రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సూరంశెట్టి కిషోర్, మునిసిపల్ కౌన్సిలర్లు మల్లాది వాసు, కోనా ధనికుమార్, మునుగోటి వెంకటేశ్వరరావు, మాధురి మాజీ సర్పంచ్ కర్నాటి రామారావు నాయకులు నిడమానూరు వంశీ, పారుపల్లి విజయ్, దారా బాలరాజు, పాటిబండ్ల సత్యంబాబు, అద్దంకి రవి తదితరులు పాల్గొన్నారు.

స్నానాల లక్ష్మీపురం, గండగలపాడుల్లో మల్లు నందిని పర్యటన

వైరా: మండలంలోని స్నానాల లక్ష్మీపురం, గండగలపాడు గ్రామాల్లో ఆదివారం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సతీమణి, అమ్మఫౌండేషన్ చైర్మన్ మల్లు నందిని పర్యటించారు. భట్టి స్వగ్రామమైన స్నానాల లక్ష్మీపురంలో ముత్యాలమ్మ వేడుకల్లో నందిని మహిళలతో కలిసి పూజలు చేశారు. తర్వాత ఆగ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటుచేసిన సరస్వతీదేవి విగ్రహాన్ని ఆమె ఆవిష్కరించారు. అనంతరం గండగలపాడు గ్రామస్థుల విజ్ఞప్తి మేరకు అక్కడ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తమ గ్రామంలో ఫంక్షన్‌హాల్ నిర్మించేందుకు ప్రభుత్వం ద్వారా సహకరించాలని ఆమెను కోరారు. కార్యక్రమాల్లో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శీలం వెంకటనర్సిరెడ్డి, వైరా ప్రాజెక్టు కమిటీ మాజీ చైర్మన్ దొడ్డా పుల్లయ్య, వైరా పదోవార్డు కౌన్సిలర్ కర్నాటి నందిని, స్నానాల లక్ష్మీపురం మాజీ సర్పంచ్, ఉపసర్పంచ్‌లు దొడ్డా ఉషారాణి, మల్లు రామకృష్ణ, ఏఎంసీ మాజీ చైర్మన్ పసుపులేటి మోహన్‌రావు, నాయకులు కర్నాటి హన్మంతరావు, శీలం చంద్రశేఖర్‌రెడ్డి, బొడ్డు కృష్ణయ్య, బొల్లెపోగు శ్రీను, షేక్.సైదులు, పూర్ణకంటి లక్ష్మయ్య, ఇస్నేపల్లి రామారావు, అడుసుమల్లి గణేష్, రంగారెడ్డి, పొట్టపల్లి నాగేశ్వరరావు, చిత్తోజు వెంకటాచారి, నూతి వెంకటేశ్వరరావు, కళావతి, శ్రీలత, లక్ష్మీ పాల్గొన్నారు.


గండగలపాడులో అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నందిని

అమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ట్రై సైకిళ్ల పంపిణీ

చింతకాని: మండల పరిధిలోని నాగులవంచ గ్రామంలో అమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో దివ్యాంగులకు డిప్యూటి సీఎం భట్టి విక్రమార్క సతీమణి మల్లు నందిని ఆధ్వర్యంలో ట్రై సైకిళ్ల పంపిణీ నిర్వహించారు. 18 సంవత్సరాలుగా ఫౌండేషన్ ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. పేదల కొరకు రానున్న రోజుల్లో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు అంబటి వెంకటేశ్వర్లు, కన్నెబోయిన గోపి, మడిపల్లి భాస్కర్, కూరపాటి కిషోర్, బండెల నాగార్జున, కొప్పుల గోవిందరావు పాల్గొన్నారు.